# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 68, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) సోమవారం -26 - మే - 2025


## కొచ్చి తీరంలో మునిగిన నౌక... కంటైనర్లలో ప్రమాదకర కెమికల్స్!



- కేరళ తీరానికి దగ్గర్లో లైబీరియా భారీ నౌక పూర్తిగా మునక
- 640 కంటైనర్లలో ప్రమాదకర రసాయనాలు, భారీగా ఇంధనం
- సముద్ర జలాలు కలుషితమయ్యే ప్రమాదంతో కొచ్చి తీరంలో హై అలర్ట్
- ఇంధనం, కంటైనర్లు తీరం వైపు వస్తే తాకొద్దని ప్రజలకు హెచ్చరిక
- నౌకలోని 24 మంది సిబ్బందిని సురక్షితంగా కాపాడిన కోస్ట్ గార్డ్
- ఆయిల్ స్పిల్ మ్యాపింగ్‌తో పరిస్థితిని అంచనా వేస్తున్న అధికారులు

న్యూఢిల్లీ : లైబీరియా దేశానికి చెందిన ఓ భారీ సరకు రవాణా నౌక కేరళ సముద్ర తీరానికి సమీపంలో పూర్తిగా నీట మునిగిపోయింది. ఈ ఘటనతో సముద్ర జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. భారత తీర రక్షక దళం (ఐసీజీ) ఈ విషయాన్ని ధృవీకరించింది. ప్రమాద సమయంలో నౌకలో ఉన్న సిబ్బందిని సురక్షితంగా కాపాడారు. మిగతా..2లో

## "ఉగ్రవాద నాయకుడు" యూనస్..
## బంగ్లాదేశ్‌ని అమెరికాకు అమ్మేస్తున్నాడు..



న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత షేక్ హసీనా, తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్‌పై విరుచుకుపడ్డారు. ఆయన బంగ్లాదేశ్‌ని అమెరికాకు అమ్మేస్తున్నారని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ నెలలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని సైన్యం పిలుపునిచ్చిన తర్వాత, తాను రాజీనామా చేస్తానని యూనస్ బెదిరించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మహ్మద్ యూనస్ తీవ్రవాద గ్రూపుల మద్దతుతో పరిపాలన చేస్తున్నారని షేక్ హసీనా ఆరోపించారు. ఇటీవల తన పార్టీ అవామీ లీగ్‌పై నిషేధం విధించడాన్ని ఆమె ఖండించారు. దీనిని రాజ్యాంగ విరుద్ధమని అభివర్ణించారు. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు, తన తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ గుర్తు చేసుకుంటూ.. మిగతా..2లో

# ఆపరేషన్ సిందూర్ విజయం
# ప్రజలను ఎంతో ప్రభావితం చేసింది

2లో

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర అనే కార్యక్రమం ప్రారంభించింది
- ఆపరేషన్ సిందూర్ ప్రపంచవ్యాప్తంగా కొత్త నమ్మకాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చింది
- ఆపరేషన్ సింధూర్ అంటే కేవలం ఒక సైనిక మిషన్ కాదని, అది మన సంకల్పం, ధైర్యానికి ప్రతీక అని, మారుతున్న భారత దేశ ముఖచిత్రం
- యోగాతో పాటు ఆయుర్వేదాన్ని మరింత అభివృద్ధి చేయవలసి ఉం
- వచ్చే నెల 21న జరిగే యోగా దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని యోగా జీవన విధానాన్ని మారుస్తుం
- మావోయిస్ట్ ప్రభావిత గ్రామానికి తొలిసారిగా బస్సు
- ఇక ప్రధాని మోదీ గ్రామీణ మహిళలు డ్రోన్ దీదీలుగా
- విశాఖపట్నంలో జరిగే 'యోగదినోత్సవం'లో పాల్గొనే అవకాశం తమకు లభిస్తోందని ప్రధాన మంత్రి వెల్లడి

**ఆపరేషన్ సిందూర్ పై మన్ కీ బాత్ లో ప్రధాని మోదీ ఆసక్తికర విషయాలు**



న్యూఢిల్లీ : దేశం మాత్రమే కాదు ప్రపంచమంతా ఆపరేషన్ సిందూర్ గురించి ఆసక్తిగా చూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉగ్రవాదాన్నిఅంతం చేయడం దేశంలోని ప్రతిపౌరుడి సంకల్పమని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం సంఘటితమైందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కార్ గుడ్ న్యూస్.. జూన్ 2న కీలక ప్రకటనలు!

జూన్ 2 ఆవిర్భావ దినోత్సవాన సీఎం ప్రకటన చేసే అవకాశం

2లో



- పెండింగ్‌లో ఉన్న ఒక డీఏ విడుదలపై సర్కార్ యోచన
- ఇతర బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాల చెల్లింపునకు కూడా ప్రణాళిక
- ఉద్యోగుల కోసం కొత్త ఆరోగ్య పథకం ప్రకటనపై చర్చ

## మన్‌కీ బాత్ ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజలతో మమేకమవుతున్నారు



హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీ బాత్ ద్వారా ప్రజలకు చాలా అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంలో ఇలాంటి కార్యక్రమం ఎవరూ చేపట్టలేదని అన్నారు. మిగతా..2లో

## పాకిస్థాన్ ఒక విఫల రాజ్యం.. అది ఉగ్రవాదానికి అడ్డా..



- బహ్రెయిన్‌లో పాకిస్థాన్‌పై ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర వ్యాఖ్యలు
- పాకిస్థాన్‌ను "విఫల రాజ్యం"గా అభివర్ణించిన ఒవైసీ
- ఉగ్రవాదానికి పాక్ ఊతమిస్తోందని, దాన్ని ఆపాలని డిమాండ్
- భారత్ సహనాన్ని తక్కువగా అంచనా వేయొద్దని పాక్‌కు గట్టి హెచ్చరిక
- బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలోని అఖిలపక్ష బృందంలో ఒవైసీ

## జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!




న్యూఢిల్లీ : భారతదేశం తన సత్తా మరోమారు చాటింది. ప్రపంచంలోని అగ్ర దేశాలకు పోటీ ఇస్తూ భారత్ అన్ని రంగాలలోనూ దూసుకుపోతోంది. ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించింది. జపాన్ దేశాన్ని వెనక్కి నెట్టిన భారత్ ఇప్పుడు గర్వంగా అగ్రదేశాల చెంత నిలిచింది. 4ట్రిలియన్ డాలర్లకు భారత ఆర్థిక వ్యవస్థ నాలుగు ట్రిలియన్ డాలర్లకు భారత ఆర్థిక వ్యవస్థ చేరుకోవడం ప్రతి ఒక్కరికి సంతోషం కలిగిస్తుంది. ఇప్పటివరకు 4వ స్థానంలో ఉన్న జపాన్ ను వెనక్కి నెట్టి భారత్ ఆ స్థానాన్ని దక్కించుకొని నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవడం గర్వించదగ్గ అంశమని మిగతా..2లో

# మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ఆరోపణలపై విచారణ చేపట్టాలి

**మిస్ వరల్డ్-2025 పోటీల్లో మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీకి జరిగిన అవమానం తనను తీవ్రంగా బాధించిందని బీఆర్ఎస్**

- మిస్ వరల్డ్-2025 పోటీల్లో మిల్లా మ్యాగీకి జరిగిన అవమానం తనను బాధించిందన్న కేటీఆర్
- ఇలాంటి వేదికలపై ఎదుర్కొన్న అనుభవాలను చెప్పేందుకు ఎంతో ధైర్యం కావాలని వ్యాఖ్య
- తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉందన్న బీఆర్ఎస్ నేత
- ఇలాంటి గడ్డపై ఓ మహిళకు అవమానకర పరిస్థితులు ఎదురుకావడం పట్ల ఆవేదన




హైదరాబాద్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పరువును, భారతదేశ ప్రతిష్ఠను మంటగలిపిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీకి ... మిగతా..2లో

## ఏపీలో జగన్, షర్మిల.. తెలంగాణలో కేటీఆర్, కవిత సీన్లు ఒక్కటే..!

అన్నలు వదిలిన బాణాలు..

అన్నల మీదికే చెల్లెలు గురిపెడుతున్నారు.

2లో



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు రసవత్తరంగా మారాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రాష్ట్రాల్లో ఒకేలా సీన్లు రిపీట్ అవుతున్నా యన్నారు. తండ్రులు సంపాదించిన ఆస్తుల పంపకాల్లో, రాజకీయ పదవుల్లో పంపకాల్లో తేడాలు న్నాయని.. అన్నలు వదిలిన బాణాలు.. అన్నల మీదికే చెల్లెలు గురిపేడుతున్నారన్నారు. ఏపీలో జగన్ పై చెల్లి, షర్మిల బాణం ఎక్కు పెడితే, తెలంగా ణలో కేటీఆర్ పై కవిత గురి పెట్టిందని విమర్శిం చారు. తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడాని, ప్రజల అవసరాల కంటే, కుటుంబ అవసరాలే కీలకం అన్న ట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

## ఎన్టీఆర్ నుండి చంద్రబాబు వరకు.. రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు!



అమరావతి : ఎన్టీఆర్ నుండి చంద్రబాబు నాయుడు వరకు రాయల సీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు అని మంత్రి నిమ్మల రామా నాయుడు అన్నారు . నాడు ఎన్టీఆర్ పార్టీ పెట్టిన తరువాత మిగతా..2లో

## భారత్‌లో మళ్లీ కరోనా కేసులు.. అత్యధికంగా ఈ రాష్ట్రంలోనే నమోదు!



## ఏపీ రాజకీయాల్లో మరో సంచలనం.. విజయసాయి రెడ్డి టీడీపీ కీలక నేతతో నిజంగానే భేటీ అయ్యారా?



అమరావతి : రాష్ట్రంలో లిక్కర్ స్కామ్ వ్యవ హారంపై వేగంగా దర్యాప్తు జరుగుతోంది. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వారిని అధికారులు ప్రశ్నించారు. వారిలో విజయ సాయి రెడ్డి కూడా ఉన్నారు. అయితే.. ఆయన విచా రణకు హాజరయ్యే ముందు టీడీపీ కీలక నేతతో భేటీ అయ్యారనే వార్త ఇప్పుడు సంచల నంగా మారింది. విల్లాలోకి వెళు _న్న విజయసాయి రెడ్డి.. లిక్కర్ స్కామ్‌పై ప్రత్యేక మిగతా..2లో

## నేను ప్రభుత్వానికి అనుకూలంగా కాదు.. ప్రతిపక్షానికి పనిచేస్తున్నాను.. శశిథరూర్ స్పష్టీకరణ

2లో




- భారత్ సరిగ్గా అదే చేసినందుకు సంతోషంగా ఉంది
- తమకు యుద్ధం కంటే ఆర్థిక ప్రగతే ముఖ్యమన్న కాంగ్రెస్ నేత
- ఐదు దేశాల పర్యటనలో పార్లమెంటరీ బృందం
- 'ఆపరేషన్ సిందూర్' బృందానికి శశి థరూర్ సారథ్యం
- పాకిస్థాన్‌ను దెబ్బకొట్టాలని తానే వ్యాసం రాశానన్న థరూర్

న్యూఢిల్లీ : : ఉగ్రవాదం ప్రపంచానికి ఉన్న అతి పెద్ద సమస్య.. దీనిపై మనం ఐక్యంగా పోరాడాలని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు.

శుభోదయం

సోమవారం - 26 - మే - 2025

# కొచ్చి తీరంలో మునిగిన నౌక... కంటైనర్లలో ప్రమాదకర కెమికల్స్!

మొదటి పేజి తరువాయి

కొచ్చి తీరానికి సుమారు 38 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎంఎస్‌సీ ఎల్సా-3 అనే పేరు గల ఈ 184 మీటర్ల పొడవైన నౌక తొలుత ఒక వైపునకు ఒరిగిపోయింది. ఆ సమయంలో కొన్ని కంటైనర్లు సముద్రంలో పడిపోయాయి. తాజాగా, నౌక పూర్తిగా సముద్రంలో మునిగిపోయిందని ఐసీజీ అధికారులు వెల్లడించారు. ఈ నౌకలో మొత్తం 640 కంటైనర్లు ఉన్నాయని, వీటిలో 13 కంటైనర్లలో ప్రమాదకరమైన రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు. మరో 12 కంటైనర్లలో కాల్షియం కార్బైడ్ ఉందని, మిగిలిన వాటితో పాటు నౌకలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ రసాయనాలు, ఇంధనం సముద్రంలో కలిస్తే తీవ్ర పర్యావరణ నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో కొచ్చి తీరంలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. సముద్రంలో తేలియాడుతున్న కంటైనర్లు గానీ, బయటకు వచ్చిన ఇంధనం గానీ తీరం వైపు కొట్టుకువస్తే వాటిని తాకవద్దని కేరళ విపత్తు నిర్వహణ సంస్థ ప్రజలను హెచ్చరించింది. సముద్ర జలాల్లో ఇంధనం ఎంతమేరకు వ్యాపించిందో తెలుసుకోవడానికి 'ఆయిల్ స్పిల్ మ్యాపింగ్ టెక్నాలజీ'ని ఉపయోగిస్తున్న విమానం నిరంతరం గగనతలంలో పర్యవేక్షిస్తోందని అధికారులు వివరించారు. విఝింజం పోర్టు నుంచి శుక్రవారం బయలుదేరిన ఈ నౌక, శనివారం మధ్యాహ్నానికి కొచ్చిన్ చేరుకోవాల్సి ఉంది. అయితే, మార్గమధ్యంలోనే ఈ దుర్ఘటన జరిగింది. నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన భారత తీర రక్షక దళం వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. నౌకలో ఉన్న మొత్తం 24 మంది సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటన వల్ల తలెత్తే పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని సంబంధిత అధికారులు తెలిపారు. సముద్ర కాలుష్యాన్ని వీలైనంతగా నివారించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# "ఉగ్రవాద నాయకుడు" యూనస్.. బంగ్లాదేశ్‌ని అమెరికాకు అమ్మేస్తున్నాడు..

మొదటి పేజి తరువాయి

సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని అమెరికాకు ఇవ్వడానికి నిరాకరించినందుకు ఆయన హత్యకు గురయ్యారని చెప్పారు. "అమెరికా సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని కోరుకున్నప్పుడు, నా తండ్రి అంగీకరించలేదు. ఆయన తన ప్రాణాలను అర్పించాల్సి వచ్చింది. నాకు అలాంటి విధి వచ్చింది. ఎందుకంటే అధికారంలో ఉండటానికి దేశాన్ని అమ్మేయాలనే ఆలోచన నాకు ఎప్పుడూ రాలేదు" అని ఆమె ఫేస్‌బుక్ పోస్టులో చెప్పింది. "ఈ దేశ ప్రజలు జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ పిలుపునకు స్పందించి, ఆయుధాలు చేపట్టి పోరాడి, మూడు మిలియన్ల మందిని విడిపించడానికి తమ ప్రాణాలను అర్పించిన దేశం ఇది. ఆ దేశ నేలలో ఒక్క అంగుళం కూడా ఎవరికీ వదులుకోవాలనే ఉద్దేశ్యం ఎవరికీ ఉండదు. కానీ ఈ రోజు ఎంత దురదృష్టం. అలాంటి వ్యక్తి(యూనస్) అధికారంలోకి వచ్చాడు, మొత్తం దేశ ప్రజలచే పూర్తిగా ప్రేమించబడే వ్యక్తి, ప్రపంచం ప్రేమించబడే వ్యక్తి అయిన ముజిబుర్ రెహమాన్‌కి యూనస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం జరిగింది.?" అని ఆమె ప్రశ్నించారు. తీవ్రవాద గ్రూపుల సహాయంతో యూనస్ ప్రభుత్వ నియంత్రణ చేజిక్కించుకున్నారని హసీనా ఆరోపించారు. యూనస్ ఉగ్రవాదుల సాయంతో, అంతర్జాతీయ నిషేధించిన వారితో కలిసి అధికారాన్ని చేజిక్కించు కున్నారని ఆమె దుయ్యబట్టారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ ఉగ్రవాద రాజ్యాంగా ఉందని అన్నారు. ఈ తీవ్ర వాద నాయకుడికి గొప్ప బెంగాలీ దేశం యొక్క రాజ్యాంగాన్ని తాకే హక్కు లేదని, అతడిని ప్రజలు ఎన్ను కోలేదు, కాబట్టి అతను చట్టాలను ఎలా మార్చగలడు..? అవామీ లీగ్‌ని ఎలా నిషేధించగలడు అని హసీనా ప్రశ్నించారు.

# మన్‌కీ బాత్ ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజలతో మమేకమవుతున్నారు

మొదటి పేజి తరువాయి

ప్రధాని మోదీ ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారని చెప్పారు. ప్రతినెలా చివరి ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలతో మమేకమవుతున్నారని తెలిపారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ సనత్‌నగర్‌లోని లింగయ్య నగర్‌లో స్థానికులతో కలసి కిషన్‌రెడ్డి ఈ కార్యక్రమం వీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రోన్లు వినియోగించడంపై మహిళలకు శిక్షణ ఇచ్చామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. వారు వ్యవసాయానికి సంబంధించిన వివిధ పనుల కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారని తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్‌గాంలో పాకిస్థాన్ ఉగ్ర వాదులు జరిపిన ఘటనలో 26మంది అమాయకులైన మన పర్యాటకులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మన సైనికులు పాక్ ఉగ్ర శిబిరాలపై దాడులు జరిపి నాశనం చేశారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అవడంతో దేశవ్యాప్తంగా తీరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఉగ్ర దాడులను సమర్థంగా ఎదుర్కో వడంలో మన సైనికులు ముందున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.మరోవైపు ప్రధాని మోదీ (ఆదివారం) జరిగిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో తెలంగాణలోని డ్రోన్‌దీదీలను ప్రశంసించారు. సంగారెడ్డి జిల్లాలో మహిళలు డ్రోన్లతో వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. గ్రామీణ మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ తీసుకున్నారని చెప్పారు. పండ్ల తోటలపై పురుగు మందులు వాడటానికి డ్రోన్లను వినియోగించారని తెలిపారు. ఈ క్రమంలో డ్రోన్ దీదీలను స్కైవారియర్స్‌గా ప్రధాని మోదీ అభివర్ణించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కార్ గుడ్ న్యూస్.. జూన్ 2న కీలక ప్రకటనలు!

హైదరాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో ఓ శుభవార్త అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగులకు మేలు చేకూర్చే కొన్ని కీలక ప్రకటనలు చేయవచ్చని సమాచారం. ఈ ప్రకటనల్లో భాగంగా ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెండింగ్ కరువు భత్యం (డీఏ)లలో ఒకదానిని విడుదల చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అంతేకాకుండా, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఇతర బకాయిలు, పదవీ విరమణ చేసిన వారికి అందాల్సిన ప్రయోజనాలను కూడా ప్రభుత్వం అదే రోజు చెల్లించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు, ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేకంగా ఒక నూతన ఆరోగ్య పథకాన్ని కూడా ఆవిర్భావ దినోత్సవం నాడు ప్రకటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ముగ్గురు ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ కమిటీ పలుమార్లు ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై వారి నుంచి వినతులు స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించింది. ఉద్యోగులు ప్రస్తావించిన కొన్ని ప్రధాన డిమాండ్లకు కమిటీ సానుకూలంగా స్పందించి, వాటిని ఆమోదించినట్లు ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఈ కమిటీ ఒకటి రెండు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై, తమ సిఫార్సులతో కూడిన నివేదికను అందజేయనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి ఈ నివేదికను ఆమోదించిన అనంతరం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు ఈ అంశాలపై అధికారికంగా ప్రకటన విడుదల చేస్తారని ఉద్యోగ సంఘాల వర్గాలు చెబుతున్నాయి. జూన్ 2న వెలువడనున్న ఈ ప్రకటనల కోసం రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పాకిస్థాన్ ఒక విఫల రాజ్యం.. అది ఉగ్రవాదానికి అడ్డా..

హైదరాబాద్ : ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పాకిస్థాన్‌ను ఒక 'విఫల రాజ్యం'గా అభివర్ణిస్తూ, ఆ దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలోని భారత అఖిలపక్ష బృందం నిన్న బహ్రెయిన్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా అక్కడి ప్రముఖులతో జరిగిన సమావేశంలో ఒవైసీ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత కొన్నేళ్లుగా భారత్ ఎదుర్కొంటున్న ఉగ్రవాద ముప్పు గురించి ప్రపంచానికి తెలియజేయడానికే మా ప్రభుత్వం మమ్మల్ని ఇక్కడికి పంపింది. దురదృష్టవశాత్తు ఈ ఉగ్రవాదం వల్ల మేం ఎంతోమంది అమాయకుల ప్రాణాలను కోల్పోయాం. ఈ సమస్యకు పాకిస్థాన్ మూల కారణం. ఆ దేశం ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇవ్వడం, నిధులు సమకూర్చడం ఆపేంత వరకు ఈ సమస్య పరిష్కారం కాదు" అని ఒవైసీ స్పష్టం చేశారు. ప్రతి భారతీయుడి ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని ఒవైసీ తెలిపారు.

"పాకిస్థాన్ మరోసారి ఇలాంటి దుస్సాహసానికి పాల్పడితే వారు ఊహించని దానికంటే తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుంది" అని హెచ్చరించారు. తీవ్రమైన కవ్వింపు చర్యలు ఎదురైనా భారత్ ఎప్పుడూ సంయమనం పాటిస్తూ వస్తోందని గుర్తుచేశారు. పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ ఉగ్రవాదం సృష్టిస్తున్న మానవ విషాదాన్ని ఆయన వివరించారు. "ఆరు రోజుల క్రితం పెళ్లయిన మహిళ ఏడో రోజే వితంతువుగా మారింది. రెండు నెలల క్రితం వివాహమైన మరో మహిళ కూడా ఈ దాడిలో తన భర్తను కోల్పోయింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. "మా రాజకీయ అభిప్రాయాలు వేరైనా, దేశ సమగ్రత విషయంలో మేమంతా ఒక్కటే. ఈ విషయాన్ని మా పొరుగు దేశం ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి" అని ఒవైసీ అన్నారు. భారతదేశానికి తన పౌరులనే కాకుండా, దేశంలో నివసించే ప్రతి ఒక్కరి భద్రతను కాపాడటానికి కావలసిన శక్తిసామర్థ్యాలున్నాయని ఒవైసీ నొక్కిచెప్పారు.

"పాకిస్థాన్ లాంటి విఫల రాజ్యం నుంచి వస్తున్న అన్ని రకాల ముప్పులను మన వాయు రక్షణ వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయి" అని ఆయన తెలిపారు. ఉగ్రవాదానికి అందుతున్న నిధులను అరికట్టేందుకు అంతర్జాతీయ సహకారం చాలా అవసరమని ఒవైసీ పేర్కొన్నారు. బైజయంత్ పాండా నేతృత్వంలోని ఈ ప్రతినిధి బృందంలో ఒవైసీతో పాటు గులాం నబీ ఆజాద్, బీజేపీ ఎంపీలు నిషికాంత్ దూబే, ఫాంగ్నాన్ కొన్యాక్, ఎన్‌జేపీ ఎంపీ రేఖా శర్మ, ఎంపీ సత్నామ్ సింగ్ సంధు, రాయబారి హర్ష్ ష్రింగ్లా తదితరులు ఉన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి భారత్ స్పందన, సీమాంతర ఉగ్రవాదంపై దేశం సాగిస్తున్న పోరాటం గురించి అంతర్జాతీయ భాగస్వాములకు వివరించడమే ఈ బృందం పర్యటన ముఖ్య ఉద్దేశం. ఈ బృందం సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియా దేశాల్లో పర్యటించనుంది. ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని స్పష్టం చేయడం, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడం ఈ పర్యటన లక్ష్యాల్లో భాగం.

# ఆపరేషన్ సిందూర్ విజయం ప్రజలను ఎంతో ప్రభావితం చేసింది



మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాన మంత్రి మోదీ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా మన సైన్యం ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడలో అద్భుతమైన పరాక్రమం ప్రదర్శించి దేశాన్ని ఉన్నతంగా నిలిపిందన్నారు.

ఆపరేషన్ సిందూర్ సైనిక మిషన్ కాదు: పీఎం మోదీ

ఉగ్రవాద వ్యతిరేక పోరాటంగా మనం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ ప్రపంచవ్యాప్తంగా కొత్త నమ్మకాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఆపరేషన్ సింధూర్ అంటే కేవలం ఒక సైనిక మిషన్ కాదని, అది మన సంకల్పం, ధైర్యానికి ప్రతీక అని, మారుతున్న భారత దేశ ముఖచిత్రమని ప్రధాన మంత్రి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంతో దేశమంతటా భక్తిభావం నింపిందని, జాతీయజెండాలతో సైన్యానికి అభినందనలు తెలియచేయడానికి పల్లెల నుంచి మహానగరాల వరకు కదలి వచ్చాయని చెప్పారు.

ఆపరేషన్ సిందూర్ తో యువతలో దేశభక్తి

ఆపరేషన్ సిందూర్ విజయం ప్రజలను ఎంతో ప్రభావితం చేసిందని, సైన్యంలో వాలంటీర్లుగా చేరేందుకు ఎందరో యువకులు ముందుకు వచ్చారని అన్నారు. ఇక మావోయిస్టులపై ప్రభుత్వం చేస్తున్న యుద్ధం గురించి మాట్లాడిన ప్రధాని మోదీ మావోయిస్టుల ప్రభావంతో చాలా గ్రామాలు బస్సు సదుపాయానికి దూరంగా ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందని ప్రధాన మంత్రి చెప్పారు.

మావోయిస్ట్ ప్రభావిత గ్రామానికి తొలిసారిగా బస్సు

మావోయిజానికి వ్యతిరేక సామూహిక పోరాటంతో అలాంటి ప్రాంతాలకు కూడ ప్రాథమిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయంటూ, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కాటేఝరి గ్రామాన్ని ఉదహరించారు. అ ఊరికి మొదటిసారిగా చేరుకున్న బస్సుకు స్థానికులు డప్పులతో స్వాగతం పలికారని చెప్పారు. బస్సు రాకతో తమ జీవితం సుఖవంతంగా సాగుతుందని గ్రామస్తులు చెబుతున్నారని అన్నారు.

డ్రోన్ దీదీలు స్కై వారియర్స్

ఇక ప్రధాని మోదీ గ్రామీణ మహిళలు డ్రోన్ దీదీలుగా మారి వ్యవసాయంలో నూతన విప్లవాన్ని తీసుకువస్తున్నారని, తెలంగాణాలోని సంగారెడ్డి మహిళలు అందుకు నిదర్శనమని అన్నారు. సంకల్పానికి సాంకేతిక పరిజ్ఞానం తోడైతే ఏదైనా సాధించవచ్చని నిరూపించారని అన్నారు. ఆ మహిళలు డ్రోన్ ల సహాయంతో 50 ఎకరాల విస్తీర్ణంలో మందుల పిచికారీ పనిని నిర్వహించారు. వారు డ్రోన్ ఆపరేటర్లుగానే కాక స్కై వారియర్స్ గా గుర్తింపు పొందారని అభినందించారు.

యోగా దినోత్సవంపై ప్రధాని మోదీ

వచ్చే నెల 21న జరిగే యోగా దినోత్సవాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని యోగా జీవన విధానాన్ని మారుస్తుందని, ఇప్పటిదాకా యోగాకు దూరంగా ఉన్నవారు దానికి అనుసంధానం కావాలని పిలుపునిచ్చారు. పదేళ్ల క్రితం 2015 జూన్ 21న ప్రారంభమైన యోగా దినోత్సవం ఎంతో ఆదరణ పొందుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర అనే కార్యక్రమం ప్రారంభించిందని, విశాఖపట్నంలో జరిగే 'యోగదినోత్సవం'లో పాల్గొనే అవకాశం తమకు లభిస్తోందని ప్రధాన మంత్రి వెల్లడించారు.

ఆయుర్వేదంపై ప్రధాని మోదీ చెప్పిందిదే

యోగాతో పాటు ఆయుర్వేదాన్ని మరింత అభివృద్ధి చేయవలసి ఉందని ప్రధాని మంత్రి అన్నారు. ఈ నెల 24 న దీనిపై ప్రపంచ ఆరోగ్యసంస్థ డైరెక్టర్ జనరల్ తులసీభాయ్ సమక్షంలో అవగాహన పత్రాలపై సంతకాలు జిరిగాయని గుర్తు చేశారు. దీంతో ఆయుష్ ప్రపంచ వ్యాప్తంగా మరింత మందికి చేరేందుకు వీలువుతుందని అన్నారు. ఇంకా ఎన్నో ఆసక్తికర అంశాలను ప్రధాని మోదీ తన మన్ కీ బాత్ ప్రసంగంలో పేర్కొన్నారు.

# ఏపీలో జగన్, షర్మిల.. తెలంగాణలో కేటీఆర్, కవిత సీన్లు ఒక్కటే..!

మొదటి పేజి తరువాయి

మొన్న వైఎ స్సార్ కుటుంబం.. ఇపుడు కేసీఆర్ కుటుంబం.. అన్నల పైకి చెల్లెలను ఉసి గోల్పడంలో కాంగ్రెస్ కీల కంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ కు వ్యతిరేకత మొదలైందని.. రేవంత్ బీద అరుపులు అరుస్తున్నారని విమర్శించారు. ప్రజలలో ఉన్న వ్యతిరేకతను.. మళ్లించేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. టీఆర్ఎస్ పుట్టి మునిగిపోయిందని.. దేశంలో బీజేపీ వెలిగిపోతోందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. "తెలంగాణలో బీజేపీ బలపడింది.. భవిష్యత్ లో అధికారంలోకి కూడా రానుంది. కవిత లేఖ రాసింది వాస్తవమే.. కవిత కేసీఆర్ ను కలిసే పరిస్థితి లేదా? కేసీఆర్ ప్రతిపాదిస్తున్న కేటీఆర్ ను సవాలు చేస్తున్నట్టుగానే కవిత సవాలు అర్థం అవుతోంది. కేటీఆర్ నాయకత్వాన్ని అంగీకరించను అని చెప్ప కనే చెపుతోంది. అన్న ఆధిపత్యాన్ని సవాలు చేయడమే లేఖాస్త్రం. కవిత సామాజిక తెలంగాణ గురించి మా ట్లా డటం.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగానే ఉంది. భారత దేశం ఆర్థికంగా అత్యంత బలోపేతంగా నిలు స్తోంది. భారత దేశం 4 వ ఆర్థిక అతిపెద్ద దేశంగా గుర్తింపు పొందింది. భారత్ జపాన్‌ను అధిగమి ంచింది. మోదీ నాయకత్వానికి తార్కాణం. వికసిత భారత్ కూడా కచ్చితంగా సిద్ధిస్తుంది." అని వ్యాఖ్యానించారు.

# ఎన్టీఆర్ నుండి చంద్రబాబు వరకు.. రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు!

మొదటి పేజి తరువాయి

రాయలసీమ ప్రజల నుండి ఎటువంటి స్పందన వచ్చిందో, మరల ఇప్పుడు 2024 ఎన్నికల్లో అదే స్థాయిలో ఆదరణ వచ్చిందన్నారు. ఇరిగేషన్ రంగంలో తెలుగు గంగ, జిఎన్ఎస్ఎస్, హంద్రీనీవా, హెచ్ఎల్‌సి ఇలా ఎన్నో ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే నిర్మించామన్నారు. రాష్ట్రంలో మిగతా ప్రాంతాల కంటే రాయలసీమలోని హంద్రీనీవా ప్రాజెక్టుకే అత్యధికంగా బడ్జెట్లో రూ.3240 కోట్లు సీఎం కేటాయించారని మంత్రి నిమ్మల చెప్పుకోచ్చాడు. రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ%ౌ% 'అన్నమయ్య ప్రాజెక్టు తక్కువ నిర్మాణంతో రూపొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈలోపు వాస్తవ పరిస్థితిని అధికారులతో చర్చిస్తున్నాం. డ్యామ్ నిర్మాణం పూర్తి అయ్యేలోపు రైతుల సూచనల మేరకు లిఫ్ట్ ద్వారా కెనాల్స్ ద్వారా మీరు సరఫరా చేసేందుకు ప్రయత్నం చేస్తాం. గత పాలకుల ఇసుక దోపిడీ, లూటీ వల్లే అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయింది. 41 మంది చనిపోతే నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కనీసం పరామర్శించలేదు. అన్నమయ్య డ్యామ్ నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నాం' అని అన్నారు. 'నాడు ఎన్టీఆర్ పార్టీ పెట్టిన తరువాత రాయలసీమ ప్రజల నుండి ఎటువంటి స్పందన వచ్చిందో, మరల ఇప్పుడు 2024 ఎన్నికల్లో అదే స్థాయిలో ఆదరణ వచ్చింది. ఎన్టీఆర్ నుండి చంద్రబాబు నాయుడు వరకు రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇరిగేషన్ రంగంలో తెలుగు గంగ, జిఎన్ఎస్ఎస్, హంద్రీనీవా, హెచ్ఎల్సి ఇలా ఎన్నో ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే నిర్మించాం. ఈ ఏడాది సీజన్ మొదలయ్యేలోగా హంద్రీనీవా మొదటి దశ పనులు పూర్తి చేస్తాం. రాష్ట్రంలో మిగతా ప్రాంతాలకంటే రాయలసీమలోని హంద్రీనీవా ప్రాజెక్టుకే అత్యధికంగా బడ్జెట్లో రూ.3240 కోట్లు కేటాయించారు చంద్రబాబు. ఒంటిమిట్ట భూ కబ్జాదారులను కఠినంగా శిక్షిస్తాం' అని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పుకొచ్చారు.

# భారత్‌లో మళ్లీ కరోనా కేసులు.. అత్యధికంగా ఈ రాష్ట్రంలోనే నమోదు!



న్యూఢిల్లీ : భారత్‌లో మళ్లీ కరోనా కేసులు కలకలం రేపుతున్నాయి. దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. కరోనాతో మహారాష్ట్రలోని థానేలో 21 ఏళ్ల యువకుడు మృతి చెందారు. ఇక, బెంగళూరులో 84 ఏళ్ల వృద్ధుడు మరణించాడు. అయితే.. మృతి చెందిన ఇద్దరికీ ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. కరోనా సోకిన వారిలో ప్రధానంగా జ్వరం, ముక్కు నుంచి నీరు కారడం, గొంతు నొప్పి, తల నొప్పి, అలసట, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు ఉన్న వాళ్లు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో అత్యధిక కరోనా కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లోనూ కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని థానేలో కొత్తగా 8 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో 18 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయని అధికారులు చెప్పారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేరళలో 273 కరోనా యాక్టివ్ కేసులు, తమిళనాడులో 66, మహారాష్ట్రలో 56, ఢిల్లీలో 23, కర్ణాటకలో 36 యాక్టివ్ కేసులు నమోదు అయ్యాయని అధికారులు తెలిపారు.

# జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!

మొదటి పేజి తరువాయి

ఈ విషయం తెలిసిన ప్రతి ఒక్కరూ ఫీలవుతున్నారు. భారతదేశం ప్రపంచ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని నీతి అయోగ్ ప్రకటించింది. నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ : నీతి అయోగ్ సీఈవో బివిఆర్ సుబ్రహ్మణ్యమ్ ఈ మేరకు తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం మనకంటే అమెరికా, చైనా, జర్మనీలు మాత్రమే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయని ఇప్పుడు మనం నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అనుసరిస్తున్న ప్రణాళికను కొనసాగిస్తూ ఇదే విధంగా రెండున్నర, మూడు ఏళ్లలోపు ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సత్తా చాటుతున్న భారత్ : 2010 సంవత్సరంలో భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో పదవ స్థానంలో ఉందని, 2019 నాటికి బ్రిటన్ వెనక్కి నెట్టి ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఆయన వెల్లడించారు. ఆరు సంవత్సరాల కాలంలో నాలుగు స్థానాలు పైకి ఎగబాకి భారత్ తన సత్తా చాటింది అని పేర్కొన్నారు. శరవేగంగా భారత్ ఆర్థిక అభివృద్ధి : 2026 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ అంచనాలు దాదాపు 4187.017 డాలర్లకు చేరుకుంటుందని ఇప్పటికే %ఐఎంఎఫ% వరల్డ్ ఎకనామిక్ అవుట్ లుక్ ఏప్రిల్ ఎడిషన్ నివేదిక ఒక అంచనా వేసింది. ఇక వచ్చే రెండేళ్లలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆ నివేదికలో పేర్కొంది. 2025 సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.2 శాతం 2026లో 6.3 శాతం వృద్ధి నమోదు చేస్తాయని అంచనా ఉంది. జపాన్ ను ఓవర్ టేక్ చేసిన భారత్ : భారత ఆర్థిక అభివృద్ధికి భారతదేశ జనాభా ఎంతగానో దోహదపడుతున్నట్టు నీతి అయోగ్ సీఈఓ వెల్లడించారు. వేగంగా అభివృద్ధి చెందే దేశంగా భారతదేశం మారిందని, 30 సంవత్సరాల కాలంలో భారత్ ఆర్థికంగా ప్రగతి సాధించడానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి జపాన్ దేశాన్ని ఓవర్ టేక్ చేసి భారత్ శరవేగంగా దూసుకుపోవడం ఇప్పుడు ప్రతి ఒక్కరికి సంతోషం కలిగిస్తుంది.

# ఏపీ రాజకీయాల్లో మరో సంచలనం.. విజయసాయి రెడ్డి టీడీపీ కీలక నేతతో నిజంగానే భేటీ అయ్యారా?

మొదటి పేజి తరువాయి

దర్యాప్తు బృందం దూకుడుగా వెళ్తోంది. ఇప్పటికే గత ప్రభుత్వంలో కీలక వ్యవహరించిన నాయకులు, అధికారులను ప్రశ్నించింది. ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి సహా మరికొందరిని అరెస్టు చేసింది. అంతకుముందు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించారు. తాజాగా విజయసాయికి సంబంధించి సంచలన విషయం టాక్ ఆఫ్ ది ఏపీగా మారింది. టీడీ జనార్ధన్‌తో భేటీ.. లిక్కర్ స్కామ్ కేసులో సిట్ విచారణకు హాజరు కాబోయే ముందు రోజు సాయంత్రం.. విజయసాయి రెడ్డి తెలుగుదేశం పార్టీ కీలక నేత టీడీ జనార్ధన్‌ను కలిసినట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. టీడీ జనార్ధన్, విజయసాయి రెడ్డి ఒకరి వెంట ఒకరు.. ఒక ఇంట్లోకి వెళ్లడం, ఆ తర్వాత ఎవరికి వారుగా బయటకు వచ్చి వేర్వేరు కార్లలో వెళ్లడానికి సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 45 నిమిషాల పాటు సమావేశం.. మార్చి 11 సాయంత్రం 5:49 గంటలకు విజయసాయి రెడ్డి.. తాడేపల్లిలోని పార్క్ విల్లేలో.. విల్లా నెం. 27లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విల్లా ప్రముఖ నిర్మాత ఆది శేషగిరిరావుదని సమాచారం. విజయసాయి రెడ్డి లోపలికి వెళ్లిన కొద్ది సేపటికి.. టీడీ జనార్ధన్ అదే విల్లాలోకి వెళ్లారు. సుమారు 45 నిమిషాల పాటు వారిద్దరూ ఆ ఇంట్లోనే భేటీ అయినట్టు ప్రచారం జరుగుతోంది. సాయంత్రం 6:50 గంటలకు విజయసాయి రెడ్డి బయ టకు రాగా.. ఆ వెంటనే జనార్ధన్ కూడా విల్లా నుంచి వెళ్లిపోయారు. దీనికి సంబంధించి సీసీ టీవీ ఫుటేజీ అంటూ వీడియోలు వైరల్ అవుతున్నాయి. భేటీపై అనుమానాలు.. లిక్కర్ స్కామ్ కేసు విచారణకు హారజరు కావడానికి కొన్ని గంటలు ముందు ఈ భేటీ జరగడం పలు అనుమానాలకు దారితీస్తోందని.. వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ భేటీ జరిగిన కొన్ని గంటలు తరువాత.. విజయసాయి రెడ్డి సీఐడీ విచా రణకు హాజరైనట్టు తెలుస్తోంది. విచారణ తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు.

# నేను ప్రభుత్వానికి అనుకూలంగా కాదు.. ప్రతిపక్షానికి పనిచేస్తున్నాను.. శశిథరూర్ స్పష్టీకరణ

మొదటి పేజి తరువాయి

పాక్ ఉగ్రకుట్రలను ప్రపంచదేశాలకు తెలిపేందుకు భారత దౌత్య బృందం విదేశాల్లో పర్యటిస్తుంది. కాగా.. శశిథరూర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం అమెరికాకు వెళ్లింది. ఈక్రమంలోనే న్యూయార్క్‌లోని 9/11 మెమోరియల్‌ను బృందం సందర్శించింది. ఈ సందర్భంగా శశిథరూర్ మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకొన్న చర్యలను ఆయన తెలిపారు. శశిథరూర్ మాట్లాడుతూ.. "పహెల్గాంలో మతం ఆధారంగా పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడితో భారత్‌లో మతపరమైన అల్లర్లు సృష్టించాలనేది వారి ప్రయత్నంగా తెలుస్తోంది. ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థ ఈ దారుణానికి పాల్పడింది. అది లష్కరే తోయిబా అనుబంధ సంస్థ. దీన్ని ఉగ్రసంస్థగా ప్రకటించాలని ఐక్యరాజ్యసమితి భారత్ ఇప్పటికే కోరింది." అని అన్నారు.ప్రభుత్వం కోసం పనిచేయట్లేదు.. తాను ప్రభుత్వం కోసం పనిచేయట్లేదని శశిథరూర్ చెప్పుకొచ్చారు. "నేను ప్రభుత్వం కోసం పనిచేయట్లేదు. ప్రభుత్వంలో కాకుండా.. ప్రతిపక్ష పార్టీలో ఉన్నాను. ఈ దాడి తర్వాత పాక్‌పై తీసుకోవాల్సిన అంశాలను ఉద్దేశిస్తూ నేను ఒక వ్యాసం రాశాను. సరిగ్గ రెండ్రోజుల తర్వాత భారత బలగాలు పాక్‌ను బలంగా, తెలివితో దెబ్బతీశాయి. పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై భారత బలగాలు కచ్చితమైన దాడులు చేసి.. వాటిని ధ్వంసం చేశాయి. మేం ఉగ్రస్థావరాలపై దాడి చేస్తే.. పాక్ సైన్యం స్పందించింది. మాపై ప్రతిదాడులకు దిగింది. వాటిని సమర్థమంతంగా తిప్పికొట్టాం. ఈ ఆపరేషన్‌తో ఉగ్రచర్యలను భారత్ సహించదనే గట్టి సందేశం ఇచ్చింది. ఇది పహెల్గాం దాడికి ప్రతిస్పందన మాత్రమే తప్ప.. పాక్‌తో యుద్ధం చేయాలనేది మా ఉద్దేశం కాదు. దాన్ని మేము కోరుకోవడం లేదు. దేశ ప్రజల రక్షణే మాకు ముఖ్యం" అని శశిథరూర్ పేర్కొన్నారు.

# మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ ఆరోపణలపై విచారణ చేపట్టాలి

మొదటి పేజి తరువాయి




జరిగిన అవమానం తనను తీవ్రంగా బాధించిందని బీఆర్ఎస్ నేత ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇలాంటి వేదికలపై ఎదుర్కొన్న అనుభవాలను చెప్పేందుకు ఎంతో ధైర్యం కావాలన్నారు. మిల్లా ఆరోపణలపై విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సుదీర్ఘ పోస్టు పెట్టారు. "మిస్ వరల్డ్ వంటి అంతర్జాతీయ వేదికలపై స్త్రీ ద్వేషపూరిత మనస్తత్వాన్ని గట్టిగా ఎదుర్కోవడానికి చాలా ధైర్యం అవసరం. మిల్లా మ్యాగీ చాలా బలమైన మహిళ. తెలంగాణలో మీరు ఇలాంటి అవమానపూరిత పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చినందుకు నేను నిజంగా చింతిస్తున్నాను. తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉంది. మేము వారిని గౌరవిస్తాము, వృద్ధికి సమాన అవకాశాలను అందిస్తాము. మా భూమి నుంచి వచ్చిన గొప్ప నాయకులలో రాణి రుద్రమ, చిట్యాల ఐలమ్మ వంటి కొందరు మహిళలు ఉన్నారు. ఒక ఆడపిల్ల తండ్రిగా, ఏ స్త్రీ లేదా అమ్మాయి ఇలాంటి భయంకరమైన అనుభవాలను ఎదుర్కోకూడదని నేను కోరుకుంటున్నాను. మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తునకు డిమాండ్ చేస్తున్నాను" అని కేటీఆర్ తన పోస్టులో రాసుకొచ్చారు. కాగా, మిల్లా మాగీ వ్యక్తిగత మరియు నైతిక కారణాలను చూపుతూ పోటీల నుండి వైదొలగి, స్వదేశానికి తిరిగి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఆమె బ్రిటిష్ టాబ్లాయిడ్ 'ది సన్'తో మాట్లాడుతూ, పోటీల వాతావరణం "ఒక లక్ష్యంతో కూడిన అందం" అనే తన అంచనాలకు అనుగుణంగా లేదని పేర్కొన్నారు. రోజంతా, అల్పాహారం సమయంలో కూడా మేకప్‌తో, బాల్ గౌన్‌లలోనే ఉండాలని పోటీదారులను ఆదేశించినట్లు ఆమె తెలిపారు. "పోటీలకు ఆర్థిక సహాయం చేసినందుకు కృతజ్ఞతగా మధ్యవయస్కులైన పురుషులతో సోషల్ కలవాలని కోరినప్పుడు అసలు సమస్య మొదలైంది" అని 'ది సన్' పత్రికకు మిల్లా మాగీ వివరించినట్లు సమాచారం. అయితే, మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ మరియు సీఈఓ జూలియా మోర్లీ ఈ ఆరోపణలను ఖండించారు. మిల్లా మాగీ తల్లి అనారోగ్యం కారణంగా కుటుంబ అత్యవసర పరిస్థితి ఏర్పడిందని, అందుకే పోటీ నుండి వైదొలగాలని అభ్యర్థించారని తెలిపారు. "మిల్లా పరిస్థితికి మేము సానుభూతితో స్పందించి, పోటీదారురాలి శ్రేయస్సు మరియు ఆమె కుటుంబానికి ప్రాధాన్యతనిస్తూ వెంటనే ఆమెను ఇంగ్లాండ్‌కు తిరిగి పంపడానికి ఏర్పాట్లు చేశాం. దురదృష్టవశాత్తు, కొన్ని యూకే మీడియా సంస్థలు మిల్లా మాగీ భారతదేశంలో తన అనుభవం గురించి చేసినట్లుగా తప్పుడు మరియు పరువు నష్టం కలిగించే ప్రకటనలను ప్రచురించినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి మరియు మాతో ఆమె గడిపిన వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయి" అని జూలియా మోర్లీ ఒక ప్రకటనలో తెలిపారు.

## హిందూ దేవాలయాల పునరుద్ధరణలో రాణి అహల్య భాయ్ హెూల్కర్ సేవలు మరుపురానివి



గుంతకల్లు ప్రతినిధి - రామాంజనేయులు మే 26 (శుభోదయం న్యూస్): హిందూ ఆలయాల పునరుద్ధరణలో రాణి అహల్య భాయ్ హెూల్కర్ సేవలు మరపురానివని బిజెపి నాయకులు పేర్కొన్నారు ఆదివారం స్థానిక రామచంద్ర మిషన్ ఆర్ట్ ఫుల్ నెస్ ధ్యాన్య కేంద్రంలో రాణి అహల్య బాయ్ హెూల్కర్ 300 జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వన గొంది విజయలక్ష్మి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు ఆలయాల పునరుద్ధరణ కార్యక్రమంలో ఆమె చేసిన సాహసోపేతమైన విషయాలను వివరించారు ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు రవి బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, బిజెపి మహిళా నాయకురాలు అనిత లక్ష్మి రంగమ్మ కవితను పాల్గొన్నారు.

## ప్రమాదంలో మరణించిన సత్యసాయి వాటర్ సప్లై కార్మికుడు... మంగే సూరప్ప కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి



గుంతకల్లు ప్రతినిధి - రామాంజనేయులు మే 26 (శుభోదయం న్యూస్): పట్టణం లోని ఆలూరు రోడ్డు వద్ద నివసిస్తున్న సత్యసాయి వాటర్ సప్లై కార్మికుడు మంగే సూరప్ప వయసు 47 సం.. శనివారం విధులు నిర్వహించడానికి కొనకొండ్ల గ్రామంలో వాటర్ సప్లై చేయడానికి రాత్రి 10 గంటలకు గుంతకల్ నుండి ద్విచక్ర వాహనం మీద బయలుదేరగా రాత్రి సమయంలో ఎనుములు అడ్డంగా రావడంతో యాక్సిడెంట్ జరిగింది. కార్మికుడు సూరప్ప అక్కడికక్కడే ప్రమాదశాత్తు మరణించడం జరిగింది. ఆర్డబ్ల్యూఎస్ నంబర్ సెక్రెటరీ, కలెక్టర్ ఇంతవరకు స్పందించకపోవడం దారుణం.. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఆయన కుటుంబానికి 20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సూరప్పకు నివాళులర్పించి వారి కుటుంబానికి సంతాపం తెలియజేశారు..సీఐటీయూ తిమ్మప్ప,సురేంద్ర, రామాంజినేయులు,వెంకటాద్రి, సంతోష్ కుమార్,యుగంధర్ బాబు,శివన్న,విజయకుమార్.

## ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ హాస్టల్స్ లో అడ్మిషన్లు పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



గుంతకల్లు ప్రతినిధి - రామాంజనేయులు మే 26 (శుభోదయం న్యూస్): ఉమ్మడి జిల్లాలలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ హాస్టల్లో సీట్లను వెంటనే భర్తీ చేయాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మీ మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పామిడి పట్టణంలోని ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్ విద్యార్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ హాస్టల్ కు వంద ఆడ్మిషన్లుకు అనుమతి ఉంది కాని అడ్మిషన్లు సంఖ్య వార్డెన్లు నిర్లక్ష్యం వల్ల 50%అడ్మిషన్లు పూర్తి కావడం లేదని అనంతపురం జిల్లాలో గడిచినవిద్యా సంవత్సరంలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో పామిడి ఎస్సీ, హాస్టల్ లో 11,అడ్మిషన్లు గుత్తి బాయ్స్ హాస్టల్లో 18, జిల్లాలో నీ ప్రతి హాస్టల్లో 10,20,అడ్మిషన్లు కంటే భర్తీ చేయడం లేదని వార్డెన్లు నిర్లక్ష్యం వల్లే భర్తీ కావడం లేదని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వార్డెన్లపై చర్యలు తీసుకుని వందశాతం అడ్మిషన్లు భర్తీ చేసేలా చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో భాస్కర్ రాజు గోపి బాబు గోపీచంద్ విజయ్ అంజి రాము ధరణి కుమార్ చంద్రశేఖర్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## సోలార్ తో అతి తక్కువ విద్యుత్ బిల్లులు... పవన్ సోలార్ వరల్డ్ నూతన కార్యాలయం ప్రారంభం




గుంతకల్లు ప్రతినిధి - రామాంజనేయులు మే 26 (శుభోదయం న్యూస్): సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు తక్కువగా వస్తాయని గ్రోస్తులు ఈ సోలార్ ప్యానల్ ను ఉపయోగించుకుంటే విద్యుత్ చార్జీలను ఆదా చేసుకోవచ్చు అని పవన్ సోలార్డు నిర్వాహకులు అవినాష్ నాగిరెడ్డిలు అన్నారు. ఆదివారం పటంలోని పాత కెనరా బ్యాంక్ కార్యాలయంలో పవన్ సోలార్ వర్డ్ కార్యాలయం వారి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్య ,అవినాష్ నాగిరెడ్డిలు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద రాయితీతో ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవచ్చని ఎందుకు బ్యాంకులు సబ్సిడీ అందజేస్తాయన్నారు విద్యుత్ చార్జీలు ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ పథకం వలన గృహ వినియోగదారులు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందన్నారు ఇంటి పైకప్పు కనీసం 10 చదరపు/100 చదరపు స్థలంలో 1 కె డబ్ల్యూ పి సామర్థ్యం సోలార్ గ్రూప్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సోలార్ ప్యానల్ సెట్ చేసేంత స్థలం వినియోగదారుని ఇంటిపై ఉండాలన్నారు అనంతరము కరపత్రాలను విడుదల చేశారు.

## యర్రగొండపాలెం నుండి మహానాడుకు - కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన ఎరిక్షన్ బాబు





ఎర్రగొండపాలెం, మండల రిపోర్టర్ - నారాయణ (శుభోదయం న్యూస్): యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మహానాడు సన్నాహక సమావేశంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మరియు ప్రత్యేక పరిశీలకులు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సిఆర్ రాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ కుటుంబ శ్రేణులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడి వారి పుష్పాలంకరణ వేడుకల పాల్గొని ఆశీర్వదించిన శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్



దోర్నాల, మండల రిపోర్టర్ - ఆవులయ్య (శుభోదయం న్యూస్) : ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఐనముక్కల గ్రామంలో కోడి వారి పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ అలాగే దోర్నాల మండలం చింతల అగ్రహారం గ్రామంలో దండా



సుబ్బారెడ్డి వారి పోలేరమ్మ మొక్కుబడి కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో దోర్నాల మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గంట వెంకటరమణారెడ్డి షేక్ మజీద్ మరియు దోర్నాల మండల వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అందరు పాల్గొన్నారు.

## ఘనంగా 8వ సిపిఐ శాఖ మహాసభలు



గుంతకల్లు ప్రతినిధి - రామాంజనేయులు మే 26 (శుభోదయం న్యూస్): సిపిఐ పార్టీ ఎనిమిదవ మహాసభలు ఆదివారం సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారుమహాసభలకు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే దేవేంద్ర అధ్యక్షతన జరిగింది ఈ మహాసభల సందర్భంగా ముఖ్య ఆహానితులుగాలు చేసినటువంటి సిపిఐ పతాకావిష్కరణని సిపిఐ పార్టీ మాజీ కౌన్సిలర్ దేవర గుడి లక్ష్మీ ఆవిష్కరించడం జరిగింది తదనంతరం ఈ మహాసభలకు ముఖ్య ఆహ్వానితులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ బి గోవింద్ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం వీరభద్రస్వామి నియోజకవర్గ సహాయ కార్యదర్శి బి మహేష్ సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ గోపీనాథ్ సిపిఐ పార్టీ మాజీ కౌన్సిలర్ రమాదేవి సిపిఐ రూరల్ కార్యదర్శి సహాయ కార్యదర్శి రాము రాయలు రామాంజనేయులు, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు ఈ సురేష్ ఈశ్వరయ్య ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పిసి కుల్లాయప్ప ప్రజానాట్య మండల నాయకులు చంద్ర రాయుడు బీటీ పకీరప్ప కాలనీ శాఖ కార్యదర్శి గడ్డం వెంకటేష్ విద్యార్థి నాయకులు వెంకట నాయక్ పాల్గొన్నారు తదనంతరం కామ్రేడ్ బి గోవింద్ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్ర స్వామి మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో జరుగుతున్నటువంటి అవినీతి అక్రమాల పైన



కమ్యూనిస్టులు యొక్క నాయకత్వం చాలా అవసరము ఎక్కడ చూసినా మహిళల పైన అత్యాచారాలు దాడులు విపరీతంగా పెరిగే పోతున్నాయి అదేవిధంగా రాజ్యాంగానికి విఘాతం కలిగిచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నటువంటి దుశ్చర్యలకు వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఎంతో ఉందని కావున కమ్యూనిస్టు పార్టీ శాఖలో మరింత బలోపితంగా పనిచేయాలని పిలుపునివ్వడం జరిగింది తదనంతరం నూతన బి టి పకీరప్ప కాలనీ శాఖ కమిటీ మెంబర్స్ గా 12 మందిని మరియు శాఖ కార్యదర్శి గా నరసింహ చారిని సహాయ కార్యదర్శి అఖిలు, పెయింటర్ వీరాంజిని ఎంపిక చేశారు.

## బాధిత కుటుంబానికి సీఎం సహాయనిది చెక్కు పంపిణీ చేసిన...

### టిడిపి పార్లమెంటు కార్యదర్శి నాగ ముని రెడ్డి



సిద్దవటం, మండల విలేకరు - జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్) : సిద్దవటం మండలం టక్కోలు ఎస్సీ కాలనీకి చెందిన బుచ్చనపల్లి నాగదేవి అనారోగ్యంతో బాధపడుతుండగా, ప్రభుత్వం ద్వారా అందించే సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేశారు. ఈ అప్లికేషన్‌పై రాజంపేట టీడీపీఇంచార్జ్ శ్రీ సుగువాసి బాల సుబ్రహ్మణ్యం చొరవచూపి, నారా లోకేష్ ఆదేశాల మేరకు, టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి నాగముని రెడ్డి కృషితో నిధులు త్వరితగతిన మంజూరు అయ్యాయి.ఈ నిధులకు సంబంధించిన చెక్కును స్వయంగా నాగముని రెడ్డి వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా నాగముని రెడ్డి మాట్లాడుతూ, “రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి పెద్దకొడుకులా అండగా ఉండేలా నారా లోకేష్ పనిచేస్తున్నారు. ప్రజల కష్టాలు పరిష్కరించడంలో ఆయన చొరవ చూపడం ఎంతో ఆనందం గా ఉంది “ అని తెలిపారు.లబ్ధిదారులు తమ కృతజ్ఞతలు తెలియజేస్తూ, “చిన్నదైన కాల వ్యవధిలోనే స్పందించి, మద్దతు ఇచ్చిన నారా లోకేష్ కి, సుగువాసి బాల సుబ్రహ్మణ్యంకి, నాగముని రెడ్డి గారికి జీవితాంతం ఋణపడి ఉంటాం” అన్నారు.కి సీఎం సహాయ నిధి చెక్కుపంపిణి. చేశారు పార్లమెంట్ కార్యదర్శి నాగమణి రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

## మహానాడుకు పెద్దఎత్తున తరలి రండి: యార్లగడ్డ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా జరిగే మహానాడు కార్యక్రమాన్ని ఈనెల 27వ తేదీ నుండి కడపలో మూడు ం ో జు ల ఎ ా ట ు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ 43 ఏళ్ళ క్రితం ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసి రాష్ట్రంలో పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేయడం ద్వారా వారి మనసుల్లో సుస్థిర స్థానం పొంది ఆరాధ్య దైవంగా మారారని పేర్కొన్నారు. మన దేశం సినిమాతో సినీ కెరీర్ ను ప్రారంభించిన ఎన్.టీ.ఆర్ నా దేశం సినిమా అనంతరం రాజకీయాల్లో ప్రవేశించి తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసి కేవలం 9 నెలల కాలంలో రాష్ట్రంలో అధికారం చేపట్టిన మహెూన్నత వ్యక్తి ప్రజానాయకుడు అన్న ఎన్టీఆర్ అని కొనియాడారు. వరి అన్నం లగ్జరీగా ఉండే ఆ రోజుల్లో పేదలందరికీ అందరికి వరి అన్నం అందించాలని లక్ష్యంతో కిలో రెండు రూపాయలు బియ్యం పథకం ప్రవేశ పెడితే తదుపరి వచ్చిన ఏ ప్రభుత్వం కూడా ఆ పథకాన్ని రద్దు చేసే సాహసం చేయకపోవడం ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకం ప్రాధాన్యతను తెలియచేస్తుందన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహనీయుడు అన్న నందమూరి తారక రామారావు అని చెప్పారు. తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఆయన పేద బడుగు బలహీన వర్గాల వారికి తగు అవకాశాలు కల్పిస్తూ వారిని రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చేశారని చెప్పారు. తదుపరి అధికార పగ్గాలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఐటి రంగాన్ని ప్రోత్సహించడంతో నేడు మన తెలుగువారు ప్రపంచ దేశాల్లో ఐటీ రంగంలో ఓ వెలుగు వెలుగుతున్నారని వెంకట్రావ్ గుర్తు చేశారు. గతంలో హైదరాబాద్ నుండి రూ.90 కోట్ల ఉన్న ఐటీ ఎగుమతులను చంద్రబాబు నాయుడు రూ. 2.60 లక్షల కోట్లకు పెంచటం ఆయన పరిపాలన దక్షతకు ఉదాహరణగా పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో రాష్ట్రంలోని 20 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన నారా లోకేష్ ఆ దిశగా శక్తివంతం లేకుండా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కార్యకర్తల సంక్షేమం కోసం బీమా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రమాదవశాత్తు కుటుంబ పెద్దన కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలకు ప్రయోజనం కలిగించారని కొనియాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం తెలుగుదేశం పార్టీ శ్రేణులకు ఒక పండుగ లాంటిదని ఈ పండుగను విజయవంతం చేసేందుకు గన్నవరం నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కదిలి రావాలని ఈ సందర్భంగా యార్లగడ్డ పిలుపునిచ్చారు.

## ఆముదాల సూర్యనారాయణ కుటుంబానికి జనసేన పార్టీ ఎప్పుడు అండగా ఉంటుంది - ఎమ్మెల్యే




(శుభోదయం న్యూస్), జీలుగుమిల్లి: మండలంలోని కామయ్యపాలెం గ్రామానికి చెందిన కుట్టు మిషన్ టైలర్ ఆముదాల సూర్యనారాయణ కి ఇటువలే పక్షవాతం వచ్చి ఆరోగ్యం క్షీణించడం తో వారి కుటుంబం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ని ఆయన క్యాంపు కార్యాలయం లో కలిసి, ఆర్థికంగా ఆ కుటుంబం చితికిపోవడం అలాగే కుటుంబ పోషణకు దిక్కైనా కుటుంబ పెద్ద మంచాన పడటం పై ఆ కుటుంబం తీవ్ర ఆవేదనలో ఉన్నట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కు తెలియజేశారు. వెంటనే మానవత దాతృత్వం చాటిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం రాత్రి సూర్యనారాయణ నివాసనికి వెళ్ళి ఆర్థిక సాయం తో పాటు పలు నిత్యావసర సరుకులు పంపిణి చేశారు. అధర్య పడొద్దు కూటమి ప్రభుత్వం మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఆసుపత్రి లో చికిత్స నిమిత్తం ఏ అవసరం వచ్చినా నేరుగా ఎమ్మెల్యే ని అశ్రాయించమని ఆయన అన్నారు. వారి ఇంటికి వెళ్లడం తో బాధిత కుటుంబ సభ్యులు ఆనందోత్సాహంలో మునిగారు, ఎన్నడు లేని విధంగా ఎమ్మెల్యే స్పందించిన తీరు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పేద వారికి ఆపదోస్తే హామీ ఇచ్చినట్లే నేరుగా వారి నివాసనికి వెళ్లడం పట్ల గ్రాస్తులు శభాష్ ఎమ్మెల్యే అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, సీనియర్ జనసేన నాయకులు కరాటం ఉమా, మండల జనసేన అధ్యక్షులు పసుపులేటి రాము, గ్రామ జనసేన అధ్యక్షులు బండారు అనిల్, కూటమి నాయకులు గుడెల్లి లక్ష్మీ నారాయణ, బండారు సత్యనారాయణ, పానుగంటి శ్రీను, పేరం శ్రీను, బండారు మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి 20 వేలు అందించిన సర్పంచ్ గంగ లక్ష్మణ్ భర్త శనివారప్ప (మాదిగ)



లేపాక్షి, మండల రిపోర్టర్ - అమరేష్ (శుభోదయం న్యూస్): మండల పరిధిలోని కంచి సముద్రం గ్రామంలో వెలిసిన శ్రీ రామలింగేశ్వర స్వామి గుడికి తన వంతు సహాయంగా కంచి సముద్రం గ్రామ పంచాయతీ సర్పంచ్(మాదిగ) గంగా లక్ష్మమ్మ రాము రామలింగేశ్వర స్వామి ఆలయం కు 20,000 రూపాయలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు ఇవ్వడం జరిగింది, ఇంతే కాకుండా భవిష్యత్తులో ఆలయ అభివృద్ధి కొరకు తన వంతు సహాయం ఉంటుందని తెలిపినారు. 28, 29 న జరుగు ఆలయ ప్రతిష్ట కు కుటుంబ సమేతంగా రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులను సన్మానించిన మోబీన మౌలాలి కొండ నరసింహులు తోట రవికుమార్



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): స్థానిక మండల టీడీపీ కార్యాలయంలో!ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్ మోబిన మవు లాలి,కొండా నరసింహులు, తోట రవి కుమార్ గార్ల ఆధ్వర్యంలో! జరిగిన సన్మాన కార్యక్రమంలో పామూరు మండల టిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు గారు పాల్గొన్నారు. సన్మాన గ్రహీతలు... పామూరు పట్టణ టిడిపి కమిటీ అధ్యక్షుడు యస్. డి అమీర్ బాబు,ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నోస్సం నాగేంద్ర చారి గార్లు.. పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు మెంట నరసింహరావు...మరియు యూనిట్ ఇంఛార్జిస్, యస్. కె గౌస్ బాష, గోళ్ళ వీరబాబు, పాయల తిరపతయ్య, సింగనపల్లి హాజీ మస్తాన్, యస్. కె హుస్సేన్,యస్. కె జిలాని,తదితరులు హాజరయ్యారు.

## గంగమ్మ తల్లి ఆలయంలో కదిరి పార్ధసారధి పూజలు



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): సిఎస్ పురం గ్రామంలో డి జి పేట రోడ్డులో జరుగుతున్న గంగమ్మ తల్లి తిరునాళ్ళ సందర్భంగా ఆదివారం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్ధసారథి గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు పార్ధసారథి కి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సక్కుబాయి అమ్మ మాతకు ఘనంగా40 వ వార్షికోత్సవం






సిద్ధవటం, మండల విలేకరి - జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని సిద్ధపటం దిగువపేట గాంధీ వీధి లో వెలసిన సక్కుబాయి అమ్మ మాతకు 40 వ వార్షికోత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. సిద్ధవటం గాంధీ వీధిలో 1985 వ సంవత్సరం పండరి భజన భక్తులందరూ నిర్వహించి అనంతరం అగ్నిగుండంలో ప్రవేశించి వైభవంగా పండరి భజనలు నిర్వహించారు. అప్పటినుండి ప్రతి ఏడాది సక్కుబాయి అమ్మ మాత వద్ద శుక్రవారం భజనలు చేయడము పూజలు చేయడము ఆనవాయితీగా జరుగుతుండేది మే 25వ తేదీ ప్రత్యేక పూజలు నిర్వహించి సక్కుబాయి మాత కు గ్రామంలోని ప్రతి ఒక్కరూ కయాకరపురములతో మొక్కులు తీరుస్తారు. అదేవిధంగా 40 వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. అన్నదాన కార్యక్రమం పూజా కార్యక్రమంఘనంగా నిర్వహించి పండర భజనలు వేశారు. ఈ కార్యక్రమంలో భజన గురువు మందపల్లి వెంకటయ్య. భక్తులు కాటయ్య సుబ్బమ్మ హరిబాబు శివరాం భారీగా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 112 వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి



(శుభోదయం న్యూస్): 26వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు బాపట్లలో ప్రదమాంధ్ర మహాసభ 112వ వార్షికోత్సవం జయప్రదం చేయండి.1913లో మే 26న బాపట్ల టౌన్ హాలులో 112 ఏళ్ల క్రితం జరిగింది.చారితాత్మక 1913 బాపట్ల ప్రథమ ఆంధ్ర మహాసభ .బాపట్లలోని టౌన్ హాల్ తెలుగు తల్లి విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు 112వ వార్షికోత్సవం.డాక్టర్ పి సి సాయిబాబు కన్వీనర్ కోట వెంకటేశ్వర రెడ్డి కోకన్వీనర్.సన్నాహక సమావేశం బాపట్ల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగింది.ఈ సన్నాహక సమావేశంలో పాల్గొన్నవారు డాక్టర్ పి సి సాయిబాబు, కోట వెంకటేశ్వర రెడ్డి కాగిత శ్రీహరిరావు జీవి సుబ్రహ్మణ్యం వీరభద్ర రావు వెంకట్రావుసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## స్థలాలు కబ్జాదారుల్ని బయటికి లాగాలి బీసీ సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఉప్పాల మురళి గౌడ్



(శుభోదయం న్యూస్) : కొన్నిచోట్ల కొంతమంది అమాయకులు స్థలాలు కబ్జాదారులకు బలవుతున్నారని బీసీ సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఉప్పాల మురళి అన్నారు, దయచేసి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి స్థలాల ఎక్కడైతే అమాయకులు బలవుతున్నారు వారిని కాపాడే బాధ్యత అధికారులు నాయకులు ఈ ప్రభుత్వం వారిని కాపాడే బాధ్యత తీసుకుంటారని ఈ సందర్భంగా తెలియజేశారు, ఈ కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ నాయకులు పాల్గొన్నారు,

## జూన్ 9న మంద కృష్ణమాదిగ నియోజకవర్గానికి రాక ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కోట దానియేలు మాదిగ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్ర ఆవిష్కరణకు. పద్మశ్రీ మందా కృష్ణ మాది ది.9.6.2025 సోమవారం నాడు గన్నవరం నియోజకవర్గం చింతకుంట గ్రామానికి విచ్చేయుచున్న సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు కోట.దానియేలు మాదిగ తెలియజేశారు స్థానిక గన్నవరం టౌన్ అంబేద్కర్ పార్క్ లో కృష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి కోట కృష్ణ మోహన్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎం ఈ ఎఫ్ సమావేశం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు తీసుకుని ప్రప్రదంగా కృష్ణాజిల్లాలో గన్నవరం నియోజకవర్గానికిమా జననేత వస్తున్నారు కావున మాదిగ ప్రజలు ప్రజాస్వామిక వాదులు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిస్తున్నాం!! లక్ష్యసాధకుడు సామాజిక ఉద్యమ నేత ప్రజల పక్షాన నిరంతర ప్రశ్నించే గొంతుకై భారత ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డు ఇవ్వటం ప్రతి మాదిగ బిడ్డకు దక్కిన గౌరవమని ఆ మహా నాయకుడు గన్నవరం గడ్డం మీదకు వస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని చింతకుంటలో జరిగే విగ్రహావిష్కరణ జయప్రదం చేయాలని కోరుచున్నాం ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మంద వేణు మాదిగ కృష్ణాజిల్లా ఎం ఇ ఎఫ్ అధ్యక్షులు దేవరపల్లి విక్టర్ బాబు ఎం ఈ ఎఫ్ గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జ్ దేవరపల్లి ఏసుబాబు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రామ్ దాని మాదిగ ఎమ్మెస్ పి ఉంగుటూరు ఇంచార్జ్ పులపాక పాస్కల్ మాదిగ ఎమ్మార్పీఎస్ బాపులపాడు ఇంచార్జ్ కొప్పుల కామేశ్వరరావు మాదిగ పోలిపాక కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ నాయకులు తమ్ముడు రుద్రయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు లామ్ రమేష్ వడ్లమూడి రమేష్ డోల రాంబాబు పాల్గొన్నారు.

## పెళ్లి సంబంధాల మధ్యవర్తుల ఆత్మీయ సమావేశం




నంద్యాల, శుభోదయం న్యూస్: మంగళవారం రోజు నంద్యాల జిల్లా నంద్యాల టౌన్ లోని పెళ్లి సంబంధాలు కుదిరిస్తున్న మధ్యవర్తులైన మీడియేటర్స్ అందరూ కలిసి నంద్యాలలోనే ఆత్మీయ సమావేశం మీటింగ్ ఏర్పాటుతో జరుగుతున్నది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విజయవాడ నుండి, అన్న జేఏసీ అసోసియేషన్ %ఒ% రెడ్డి సంఘం అసోసియేషన్ వ్యవస్థాపకులైన ఈదర హర్షవర్ధన్ రెడ్డి, మరియు ఉండేలా సుబ్బారెడ్డి ఇద్దరు విచ్చేస్తున్నారు, అలాగే తెలంగాణా నుండి సురేందర్ రెడ్డి కూడా వస్తున్నారు, సమావేశం జరుగు స్థలం నంద్యాల టౌన్ లోనే ఆర్ టి సీ బస్టాండ్ దగ్గర మీనాక్షి సెంటర్ హుస్సేన్ రెడ్డి చికెన్ షాప్ ఎదురుగా పావు కమర్షియల్ కాంప్లెక్స్ (7) లోని మీటింగు సమావేశం జరుగుతుంది, ఇక్కడే మధ్యాహ్నం భోజనం సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు, మధ్యవర్తులైన మీడియేటర్స్ చాలామంది హాజరు కావలసినదిగా కోరడమైనది, ఇంతటి అరుదైన ఆత్మీయ సమావేశం నంద్యాల జిల్లాకు సంబంధించిన ముఖ్య మీడియేటర్స్ అయినటువంటి నంద్యాల జిల్లా అధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు, రమణ , లక్ష్మన్న, మహిళా అధ్యక్షురాలు భవాని, ఇంకా ముఖ్యమైన మీడియేటర్స్ కలిసికట్టుగా పట్టుబట్టారు, నంద్యాల జిల్లాలోనే తొలిసారిగా ఆత్మీయ సమావేశం జరుపుకోవాలని నిర్ణయించుకోవడంతో, అన్న జేఏసీ%ఒ% రెడ్డి సంఘం అసోసియేషన్ గ్రూపులలో ఉన్న మీడియేటర్స్ అయినటువంటి వారు అందరూ పాల్గొనవచ్చును, ఆంధ్ర రాష్ట్రంలోని తెలంగాణ రాష్ట్రంలోని మధ్యవర్తులైన మీడియేటర్స్ పాల్గొనాలి, ప్రతి మీడియేటర్స్ కు ఆహ్వానం పలుకుతున్న, ఆత్మీయ సమావేశంలో బయట వారి మీడియేటర్స్ కూడా పాల్గొనవచ్చు అందరూ ఆహ్వానితులే, సమావేశంలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా బీరప్ప మ్యారేజ్ బ్యూరో ఒక ప్రకటనలో నారాయణ తెలిపారు.

## అమరుల స్ఫూర్తితో సంక్షేమ బోర్డు సాధిస్తాం సంగిశెట్టి క్రిష్టఫర్ టి యు జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



వలిగొండ మండల రిపోర్టర్(శుభోదయం న్యూస్):తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొట్లాడి నఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు లక్ష్యంగా అమరుల స్ఫూర్తితో సంక్షేమ బోర్డు సాధిస్తామనితెలంగాణ ఉద్యమకాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఆనాడు సమైక్య పాలకులకు ముచ్చెమటలు పట్టించి,ఆంధ్ర పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులను గత ప్రభుత్వాలు మోసం చేశాయని రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులు హక్కులను సాధించుకోవడం పెద్ద కష్టమేమి కాదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను జూన్ రెండులోగా స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మంటి రమేష్ యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు చేర్యాల సుగుణమ్మ భువనగిరి మండల అధ్యక్షులు కొండాపురం శ్రీనివాస్ వలిగొండ మండల అధ్యక్షులు గాజుల యాదగిరి మండల కార్యదర్శి మంటి లింగయ్య గంగాధర్ సత్తయ్య కానుకుంట్ల పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ వాటర్ మెన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది గ్రామపంచాయతీ కార్మికులు పనిచేస్తూనే ఆకస్మికంగా అనారోగ్యంతో మరణిస్తున్నారు వీరి కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ళ గణపతి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు నర్సాపురం గ్రామంలో గత 30 సంవత్సరాలుగా గ్రామపంచాయతీలో వాటర్ మెన్ గా ఎంపీడబ్ల్యూ వర్కర్ గా పనిచేస్తూ గ్రామ ప్రజల కు అనేక సేవలు చేసి ఈరోజు అనారోగ్యంతో మరణించడం జరిగింది వారి కుటుంబానికి ఎలాంటి పిఎఫ్ గాని ఇన్సూరెన్స్ గాని ప్రభుత్వం ఇచ్చేటటువంటి బెనిఫిట్స్ ఏమి రాలేదు కావున అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రభుత్వం వెంటనే 10 లక్షల ఇన్సూరెన్స్ మంజూరు చేయాలని చావు ఖర్చుల నిమిత్తం 30 వేల రూపాయలు ఇవ్వాలని అతని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని రాష్ట్రంలో ఉన్నటువంటి12769 గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ ప్రతినెల ఇచ్చే వేతనం కూడా పెండింగ్ లేకుండా ఇవ్వాలని ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బందెల బిక్షం నరసాపురం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులందరూ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సింగరేణి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



రామగుండం మండలం, రిపోర్టర్ - తిరుపతి,(శుభోదయం న్యూస్): రామగుండం సింగరేణి సంస్థ అధికారులతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అభివృద్ధి పనుల విషయంలో ఇల్లందు గెస్ట్ హౌస్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆదివారం రోజున సింగరేణి సంస్థ జీఎం లలిత్ కుమార్ తో పాటు వివిధ



శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రధానంగా గోదావరిఖని పట్టణ చౌరస్తాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు, ఇంటర్నల్ రోడ్లు, తాగునీటి కోసం రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ వాటర్ నిర్మాణ పనులు, జనగామ, బస్టాండ్ తదితర ప్రాంతాలలో రోడ్లు, లైటింగ్స్ విషయమై అధికారులతో ప్రస్తావించారు. అంతేకాకుండా మురుగు నీటిని శుభ్రం చేసే ఎస్టిపి ల నిర్మాణం విషయంలో పురోగతిపై చర్చించారు. గ్రామాల అభివృద్ధి, ప్రధాన రోడ్ల నిర్మాణపు పనుల గురించి ప్రస్తావించారు. అదేవిధంగా ముస్లింలకు సంబంధించిన కబ్రిస్తాన్ నిర్మాణ పనుల గురించి చర్చించారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

## గీతాంజలి హై స్కూల్ (2000-2001) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్): గోదావరిఖనిలోని గాంధీ నగర్ లో గల గీతాంజలి హై స్కూల్ 2000-2001 పదవ తరగతి బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక శ్రీనగర్ కాలని లోని సాయిలీల బ్యాంక్ ఎట్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 25సంవత్సరాల తర్వాత ఎక్కడెక్కడో ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా స్థిరపడిన వారంతా ఒకచోట కలుసుకొని తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ వారి జీవన స్థితిగతులను తెలుసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కంది రవీందర్ రెడ్డి ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డబ్ల్యూపీసీ -తెలంగాణ సహకారంతో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీలు



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్) మే 25: దేహ దారుద్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ నరసింహన్ కన్నన్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి అరవింద్ అన్నారు. డబ్లూపీసీ తెలంగాణ సహకారంతో బెంజమిన్ రోమన్ మజిల్ కనెక్ట్ జిమ్ తిరుమలగిరి లో జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ నరసింహన్ కన్నన్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి అరవింద్, కంటోన్మెంట్ మైనార్టీ విభాగం చైర్మన్ సామ్సన్ సూర్యకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహ కన్నన్ మాట్లాడుతూ...సామాజిక వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండడానికి వారి జీవితంలో ఎదగడానికి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీలు సహాయపడతాయని పేర్కొన్నారు. అనంతరం ఛాంపియన్షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన సభ్యులకు అంకిత్ టీన్-3(67.5)కిలోలు, బండారి కౌశిక్ 90 కిలోలు టీన్ -3,శివ బార్గవన్,82.5,ఓపెన్,మరియు సిమ్రాన్ 75,ఓపెన్,మట్ట సాయి స్వరూప్ 90,జూనియర్, రిప్ప చంద్ర శేఖర్ 75,జూనియర్, డిజా, తపస్య, షేక్ రేహాన్ల, అంతోని మోజస్ జాన్ కు గోల్డ్ సిల్వర్ పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బెంజమిన్ రోమన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ డాక్టర్ కే.ఏ పాల్ శాంతి ప్రార్థనలు



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్) మే 25: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోని జింఖాన గ్రౌండ్లో రాష్ట్ర హైకోర్టు అనుమతితో ప్రపంచ శాంతి దూత డాక్టర్ కే. ఏ పాల్ ప్రపంచ శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే ఏ పాల్ ప్రజలకు శాంతి సందేశాన్ని అందించారు. ప్రపంచ వ్యాప్తంగా దేవుడు యుద్ధ వాతావరణంతో లేకుండా ప్రశాంతంగా ప్రజలు ఉండాలని కాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ పీస్ అంబాసిడర్స్, ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ వసతి గృహాలవిద్యార్థులకు
## , గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలు విడుదల చేయాలి
### ఎస్ ఎఫ్ ఐ డిమాండ్




మంగపేట, మండల రిపోర్టర్ – తులసి (శుభోదయం న్యూస్): వందశాతం ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెస్ చార్జీలు విడుదల చేయకపోవడం దుర్మార్గం ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి టి, ఎల్ రవిగిరిజన విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుంది ఎస్ ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాదు రాకేష్ డిమాండ్మలుగు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ములుగు మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి,ఎల్ రవి జిల్లా ఉపాధ్యక్షులు సాదు రాకేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ హాస్టల్ కు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల కు గత డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకుగత 5నెలలుగా మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయకపోవడం దుర్మార్గం అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ హాస్టల్, గిరిజన ఆశ్రమ పాఠశాల లో విద్యార్థులకు వందశాతం ఫలితాలు వచ్చాయని ప్రశంసలు గుప్పించిన మంత్రి సీతక్కకు , గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శరత్ వసతి గృహాలవిద్యార్థుల బకాయిలో వున్నా మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయడానికి చేతులు రావడం లేదా అని ప్రశ్నించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన సంక్షేమ హాస్టల్, గిరిజన ఆశ్రమ పాఠశాల ల విద్యార్థుల మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని మరియు అన్ని గిరిజన సంక్షేమ హాస్టల్ మరియు గిరిజన ఆశ్రమ పాఠశాల ల అభివృద్ధి కి ప్రతి హాస్టల్ కి మెనర్ రిపేరింగ్లకు కనీసం 5లక్షల రూపాయలు తగ్గకుండా ఇవ్వాలనీ డిమాండ్ చేయడం జరిగింది.వందశాతం ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని ఇప్పటికే ఎస్సీ బిసి హస్టళ్ళ విద్యార్థుల మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల కావడం జరిగింది.కావునా.తక్షణమే గిరిజన సంక్షేమ హాస్టల్ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల బకాయిలో వున్నా మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని గిరిజన విద్యార్థులు గా పుట్టడం పాపమా వందశాతం ఫలితాలు సాధించడం శాపమాతక్షణమే బకాయిలో వున్న మెస్ కాస్మెటిక్ చార్జీలు విడుదల లేని పక్షంలో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శరత్గారి కార్యాలయం మంత్రి సితక్క కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారుఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దీగొండ భరత్,జిల్లా నాయకులు గుగులోత్ రమేష్, సోడి,అశోక్ ,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిస్సహాయ మహిళ మీర్జా వివాహానికి ఆర్థిక సహాయం
## అందజేసిన త్రిశక్తి మతా సేవా స్వచ్ఛంద సంస్థ
## త్రిశక్తి మాతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆర్గనైజర్ శ్రావణ్ కుమార్



రామగుండం మండలం, రిపోర్టర్– తిరుపతి, (శుభోదయం న్యూస్):స్థానిక అంతర్గాం మండలం ఆదివారం రోజున చిన్న వయసులోనే అమ్మా నాన్నలను కోల్పోయి పిన్నానా సంరక్షణలో పెరిగి ఈనెల తేదీ:29-05-2025 గురువారం రోజున జరగబోయే వివాహ కార్యక్రమానికి నిర్వాహకులు అపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న సమయంలో స్థానికులు త్రిశక్తి మాత స్వచ్ఛంద సేవా సంస్థ వారికి ఇట్టి విషయమై సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించిన త్రిశక్తి మాత సంస్థ ఆర్గనైజర్ శ్రవణ్ కుమార్ స్పందించి నిరుపేద నిస్సహాయ వధువు మీర్జా కుటుంబ సభ్యుల సమక్షంలో వధువుకు 5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగినది. సంఘ సేవకులు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ అంగరంగ వైభవంగా బ్రహ్మాండంగా మీర్జా వివాహం జరగబోతుందని నిస్సహాయులకు చేయూతను అందించడమే మా సంకల్పం అని వధువు మీర్జాకు మేమున్నామనే భరోసా కల్పించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ నసీమ తో పాటు ఆఫీస్,అలీమ్,అఫ్జల్ తో పాటు వధువు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కుక్కలా గూడూరు గ్రామంలో ఎంతో వైభవంగా జరిగిన
## ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు
### ముఖ్యఅతిథిగా రామగుండం ఎమ్మెల్యే సతీమణి మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్ శ్రీమతి మనాలి ఠాకూర్



రామగుండం మండలం, రిపోర్టర్– తిరుపతి, శుభోదయం న్యూస్): పాలకుర్తి మండలం లోని కుక్కలాగుదూర్ గ్రామంలో ఈ రోజు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించబడింది. స్థానిక ప్రజల భాగస్వామ్యం, భక్తిశ్రద్ధలతో సాగిన ఈ పవిత్ర కార్యక్రమం గ్రామం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారి సతీమణి మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్ శ్రీమతి మనాలి ఠాకూర్ విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, అమ్మవారి బోనాలు మన సంస్కృతిలో ఒక అద్భుతమైన భాగం. ఈ తరహా సంప్రదాయ కార్యక్రమాలు నూతన తరానికి మానవీయ విలువలు, భక్తిశ్రద్ధల విలువను తెలియజేస్తాయి, అని



పేర్కొన్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా స్థానిక కళాకారులు పోచమ్మ అమ్మవారి పాటలతో భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా ముదిరాజ్ సంఘం సభ్యులు ప్రత్యేకంగా కృషి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు, యువత, మహిళా సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్థులు మనాలి ఠాకూర్ ని అభినందించి, వారు సేవా కార్యక్రమాలను ప్రశంసించారు.

## మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల
## కేశవరావు తదితరుల హత్యలపై సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలి

### ఎం శ్రీనివాస్, సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు






గోదావరిఖని టౌన్, రిపోర్టర్– సురేష్, (శుభోదయం న్యూస్): సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర పిలుపులో భాగంగా పహల్గామ్ హత్యలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని, ఆపరేషన్ సింధూర్ లో దాగి ఉన్న నిజాలతో అన్ని కోణాలను బహిర్గతం చేయాలని, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు తదితరుల హత్యలపై సిట్టింగ్ జడ్జి చే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ.పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జిల్లా సదస్సు నిర్వహించటం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ. రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెలలో కాశ్మీర్ లోయలో ఉగ్ర దాడి జరిగిందని , దాడి చేసిన వారిని ఇప్పటికి వరకు కేంద్ర ప్రభుత్వం గుర్తించి పట్టుకోలేదని , ఆపరేషన్ సింధూర్ లో యుద్ధం అర్ధాంతరంగా ముగింపును అమెరికా అధ్యక్షుడు ట్రంపు ప్రకటించడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.అమెరికా సామ్రాజ్యవాద అధినేతకు అధికారం ఎవరిచ్చారని ఆయన నిలదీశారు. ప్రపంచంలో అతి పెద్ద దేశమైన మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు భారత పార్లమెంటులో కానీ, దేశములోని విపక్ష రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేసి కానీ, చర్చించకుండా, నేరుగా యుద్ధ విరమణ ప్రకటన ట్రంపు చేయడం, నరేంద్ర మోడీ గారు మౌనవ్రతం పాటించడం పరిశీలిస్తే, నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు లొంగిపోయి మోకరిల్లినట్లుగా ఉందని ఆయన అన్నారు.ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత ప్రజల దేశభక్తి కి పరీక్ష పెట్టిన, నరేంద్ర మోడీ సర్కార్ అనుసరిస్తున్న విధానంపై అనేక అనుమానాలు ఏర్పడుతున్నాయని ఆయన అన్నారు. పాకిస్తాన్ సరిహద్దుకు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న పహల్గాం యాత్రికులపై టెర్రరిస్టులు అతికిరాతంగా దాడి చేసి హత్య చేసి, మాయం కావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని ఆయన అన్నారు. పటిష్టమైన నిఘా విభాగం, సైన్యం కలిగి యున్న ఎందుకు ఇలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు.దేశంలో ప్రజలు శాంతిగా ఉండాలంటే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించబడాలనీ. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి, ప్రజల నిరసనను భరించలేక పోతుందని, వారి పక్షాన గొంతెత్తి న వారిని రకరకాల ముద్ర వేసి హత్య చేస్తుందని ఆయన అన్నారు. ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ. మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో కర్రెగుట్ట వద్ద ఏకపక్ష దాడులు చేసి, ఆదివాసులను, మావోయిస్టులను చంపుతున్నారని ఆయన అన్నారు. అడవిలో ఉన్న ఖనిజ, ప్రకృతి సంపదను కార్పొరేట్ అధిపతులకు అప్పజెప్పె రహస్య ఒప్పందంలో భాగంగా, ఆదివాసులను భయభ్రాంతులకు మోడీ సర్కార్ గురి చేస్తుందని ఆయన అన్నారు. నరేంద్ర మోడీ గారు ఎన్నికల వాగ్దానాలు నల్ల డబ్బు వెలికి తీసి ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షలు జామా, ప్రతి ఏటా రెండు కోట్ల కొలువులు, ఉపాధి భద్రత, రైతుల ఆదాయం రెట్టింపు, భేటీ పడావో బచావో , ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ,సుస్థిర పాలన లాంటి హామీలను అమలు చేయకుండా, ప్రజలు ప్రశ్నిస్తారని, ప్రజల ఆలోచనను వక్ర మార్గం పట్టించే కుట్ర చేస్తున్నారని అన్నారు. ఈ సదస్సుకు సీపీఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ. జిల్లా సహాయ కార్యదర్శి ఈ నరేష్ అధ్యక్షత వహించగా జిల్లా నాయకులు ఏ వెంకన్న, చిలుక శంకర్, ఈ రామకృష్ణ ,ఐ రాజేశం, మెరుగు చంద్రయ్య, రైతు సంఘం నాయకులు మునిమడుగుల మల్లయ్య, జీ మల్లేశం,డి బుచ్చమ్మ , కొల్లూరి మల్లేష్, బి బుచ్చయ్య, ఎం దుర్గయ్య,పుట్ట స్వామి,ఎడ్ల రవికుమార్, బి కొమరయ్య, చింతల శేఖర్ ఎస్ ప్రసాద్ బండ పద్మ, పి లక్ష్మి, విజయలక్ష్మి.తదితరుల తో పాటు 200 మంది పాల్గొన్నారు.సభలో ప్రణోదయ కళాకారులు పాడిన పాటలు సభ ను ఉత్తేజపరిచాయి.





## కరోనా మార్గదర్శకాలు విడుదల చేసిన వైద్య ఆరోగ్యశాఖ



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) మే- 25: కరోనా నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అంటూ సూచించిన వైద్య ఆరోగ్యశాఖ.ప్రార్థన సమావేశాలు సామాజిక సమావేశాలు పార్టీలు ఇతర కార్యక్రమాల వంటి వాయిదా వేసుకోవాలని కోరిన వైద్య ఆరోగ్య శాఖ.రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలి.ఎక్కువ జనాభా ఉన్న ప్రదేశాల్లో మాస్కులు తప్పనిసరిగా వాడాలి.జ్వరం లేదా చలి, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కార డం.లేదా ముక్కుదిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి.ఆరోగ్యశాఖ అన్ని పరీక్ష సౌకర్యాలతో కూడిన 24 గంటలు పని చేసే ల్యాబ్ లలో మాస్క్ లు, పిపీఈ కిట్ ట్రిబుల్ లేయర్ మాస్కులను తగిన పరిణామంలో ఉంచుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేసిన వైద్య ఆరోగ్యశాఖ.

## ఎస్సీ కార్పొరేషన్ వారి
## ఆర్థిక సహాయంతో కుట్టు మిషన్ల సర్టిఫికెట్ల పంపిణీ
## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) మే- 25: ఎస్సీ కార్పొరేషన్ జగిత్యాల జిల్లా వారి ఆర్థిక సహాయంతో వెల్గటూర్ మండలంలోని చెగ్యం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్సీ యువతులకు కుట్టు మిషన్లు మరియు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూఎస్సీ కార్పొరేషన్ జగిత్యాల జిల్లా వారి ఆర్థిక సహాయంతో వెల్గటూర్ మండలం చెగ్యాం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్సీ యువతులకు 50 మంది లబ్ధిదారులకు కుట్టు మిషన్లు మరియు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని,ఇటీవల గతంలో శిక్షణ పొంది.మరియు నూతనంగా నేర్చుకోవాలని ఆసక్తి ఉన్న మహిళా సోదరీమణులు వచ్చి నన్ను కలవడం జరిగిందని,దాని గురించి జిల్లా ఈడి తో మాట్లాడి దాని మీద వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగిందని, గత ప్రభుత్వంలో శిక్షణ ఇచ్చి కూడా వారికి కుట్టు మిషన్లు ఇవ్వకుండా ఉండటం వల్ల అవి మళ్ళీ వెనక్కి వెళ్ళడం జరిగిందని,నేను ప్రత్యేకంగా ప్రభుత్వ ఉన్నత అధికారులతో మాట్లాడి వారికి మిషన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని,భవిష్యత్తులో ఎస్సీ కార్పొరేషన్ నుండి ఎటువంటి స్కీమ్లు వచ్చిన అర్హులైన వారికి అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.**

## ఎన్ కౌంటర్ మృతదేహాల అప్పగింతలో ఉభయ
## తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు బాధ్యత వహించాలి
## పౌర హక్కుల సంఘం(సీల్ సి)
## ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ డిమాండ్



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) మే- 25: చత్తీస్ ఘడ్ నారాయణపూర్ ఎన్ కౌంటర్ లో మృతి చెందిన నంబాల కేశవరావు, నాగేశ్వరరావు, రాకేష్ ,విజయలక్ష్మి, లలిత మృతదేహాల కోసం గత నాలుగు రోజుల నుండి కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్న. మృతదేహాల అప్పగింతపై చేస్తున్న జాప్యాన్ని పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. మృతదేహాలకు కూడా రాజ్యాంగంలో హక్కులు కలిగి ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిధిలో పనిచేయవలసిన ప్రభుత్వాలు ప్రజాస్వామికంగా వ్యవహరించాల్సి ఉండగా మృతుల కుటుంబాలను మనోవేదనకు గురి చేయడం సరికాదు. ఇప్పటికైనా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు బాధ్యతయుతంగా వ్యవహరించి . మృతదేహాలను స్వరాష్ట్రాలకు తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలని, అంత్యక్రియలు సజావుగా జరిగేలా సహకరించాల్సిందిగా అధ్యక్షులు బొంకురి లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి రవి మరియు పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది.

## 256 మంది యోగా మాస్టర్ ట్రైనర్స్ కు శిక్షణ

మాస్టర్ ట్రైనర్స్ కి రెండు రోజులు శిక్షణ లో భాగంగా రెండవ రోజు 256 మంది మాస్టర్ ట్రైనర్స్ కు శిక్షణ ఇవ్వడం జరిగిందని జిల్లా విద్యా శాఖ అధికారి, సెట్కూరు సీఈఓ తెలిపారు.. ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర -2025, యోగ సాధన మరియు అవగాహన మాసోత్సవం సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ కు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు..జిల్లా విద్యా శాఖ అధికారి, సెట్కూరు సీఈఓ మాట్లాడుతూ మండల స్థాయి లోని ట్రైనర్స్ కు ట్రైనింగ్ ఇచ్చేందుకు గాను ఇండోర్ స్టేడియం, అవుట్ డోర్ స్టేడియం నందు 256 మంది మాస్టర్ ట్రైనర్స్ కు రెండు రోజులపాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ఆదివారం ఉదయం మురాజి దేశాయ్ నేషనల్ యూనిస్టిట్యూట్ ఆఫ్ యోగ వారు ప్రత్యక్ష ప్రసారం ద్వారా మాస్టర్ ట్రైనర్స్ కు శిక్షణను ఇచ్చారన్నారు.. నగరంలోని అవుట్ డోర్ స్టేడియం లో మాస్టర్ ట్రైనర్స్ కు ఇండోర్ స్టేడియం లో మహిళా మాస్టర్ ట్రైనర్స్ కు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఈ మాస్టర్ ట్రైనర్స్ రెండు రోజుల్లో పూర్తిగా యోగా నేర్చుకుని మండల స్థాయిలో గుర్తింపు పొందిన ట్రైనర్స్ కు ఈనెల 27వ తారీకు నుండి 31 వ తారీకు వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్స్ అందరూ యోగాలోని ప్రాణాయణము, యోగా ఆసనాలు చేసేటప్పుడు తీసుకోవలసినటువంటి జాగ్రత్తలు, ఏ ఆసనం వేస్తే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి, అనే విషయాలన్నింటి ని అవగాహన చేసుకుని యోగ నేర్చుకోవాలన్నారు... యోగ క్యాంపెయిన్ ముందుకు తీసుకొని వెళ్లవలసిన బాధ్యత మాస్టర్ ట్రైనర్స్ పై ఉందన్నారు.. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్ పాల్, సె ట్కూర్ సీఈవో వేణుగోపాల్, డి ఎస్ డి ఓ భూపతి రావు, ఆయుష్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు,రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి,మెడికల్ ఆఫీసర్స్ ప్రసాద్, యోగాచార్యులు విజయ్ కుమార్,ముని స్వామి, తదితరులు పాల్గొన్నారు..

## నేడు కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక
### అర్జీల పరిష్కార సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్
### 1100 కాల్ సెంటర్ కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు
### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

మే 25:ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటలకు నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో “ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక” కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100 కాల్ సెంటర్ ను సంప్రదించి తెలుసుకోవచ్చున్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని ” వెబ్సైట్ లో తెలుసుకోవడంతో పాటు తమ అర్జీలను కూడ నమోదు చేసుకోవచ్చున్నారు. అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం జరుగుతుందని... ఉదయం 9-30 గంటలకు అధికారులందరూ హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శుభోదయం

## సంపాదకీయం

## శ్వేతసౌధంలో మళ్లీ 'పంచాయితీ'

### (విశ్లేషణ)

అతిథుల్ని పిలిచి బహిరంగంగా వాగ్యుద్ధానికి దిగటం ఏ రకంగా దౌత్యనీతి అవుతుందో, దాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎక్కడ నేర్చారో ఎవరికీ తెలియదు. కానీ ఆయన దాన్ని కొనసాగించదల్చుకున్నారని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసాతో వైట్‌హౌస్‌లో తాజాగా సాగిన జగడం నిరూపిస్తోంది. మొన్న ఫిబ్రవరిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ ఇదే మాదిరి తగువు పెట్టుకున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధంలో తప్పంతా ఉక్రెయిన్‌దే అన్నట్టు తేల్చి, దాన్ని వెంటనే నిలిపేయాలని ఒత్తిడి తెచ్చారు. అడుగడుగునా అవమా నిస్తూ మాట్లాడారు. మళ్లీ మూణ్ణెల్లకు అదే వైట్‌హౌస్‌లో ట్రంప్ ఆ డ్రామాకే తెరతీశారు. నిజానికి ఇరు దేశాల అధినేతలు కలుసుకుని చర్చించినాక వారిద్దరూ కలిసి మాట్లాడే మీడియా సంయుక్త సమావేశం లాంఛనప్రాయమైనది. నాలుగు గోడలమధ్యా నిర్మొహమాటంగా మాట్లాడుకున్నా, వాదులాడుకున్నా... మీడియా సమావేశంలో పరస్పరం ప్రశంసించుకోవటాలు, రెండు దేశాల మధ్యా కుదిరిన ఒప్పందాల విశిష్టతను అతిగా చూపించుకోవటాలు జరిగిపోతాయి. ఇందువల్లరెండు దేశాల్లోనూ అధినేతలకు ప్రశంసలు దక్కుతాయి. కానీ ఇలాంటివి ట్రంప్‌కు పట్టవు. ప్రపంచానికి తాను మకుటంలేని మహారాజునని, ఎవరినైనా ఏమైనా అనగలనని అమెరికా శ్వేతజాతి ఓటరు మహాశయులకు ఆయన చెప్పదల్చుకున్నారు.అందుకే అతిథులుగా వచ్చిన అధినేతలను కెమెరాల ముందు ఇష్టానుసారం మాట్లాడటం అల వాటు చేసుకున్నారు. పోనీ ఆయన నిలదీస్తున్న అంశాలు గొప్పవేమీ కాదు. వాటిల్లో చాలామటుకు నకిలీవీ... నిరాధారమైనవీ. సామాజిక మాధ్యమాల్లో ఎవరెవరో పెట్టే తప్పుడు పోస్టింగులే వాటికి ఆధారం. ఉక్రెయిన్‌లో దేశాధినేతను మార్చి, ఆయన ద్వారా రష్యాను చీకాకుపెట్టి చివరకు అది రెచ్చిపోయి దాడిచేసే స్థితి కల్పించింది అమెరికాయే. అటు తర్వాత రష్యాను ప్రపంచంలో ఏకాకిని చేయటానికి ప్రయత్నించి, ఉక్రెయిన్‌కు పెద్దయెత్తున ఆయుధాలు అమ్ముకున్నది అమెరికాయే. నాటో దేశాలను సైతం ఈ రొంపిలోకి దించింది కూడా ఆ దేశమే. జో బైడెన్ హయాంలో ఇవన్నీ జరిగినట్టు తెలిసినా, ట్రంప్ ఏమీ తెలియనట్టు నటించారు. ఉక్రెయిన్‌నే వేలెత్తి చూపారు. ఇప్పుడు రాంఫోసాతో సైతం అదే తరహాలో వ్యవహారం నడిపారు. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతీయుల ఊచకోత సాగుతున్నదనీ, వాటిల్లో చాలాభాగం బయటకు రావటం లేదనీ ట్రంప్ వాదించారు. ఒకప్పటి శ్వేతజాతి పాలనలో నల్లజాతీయులపై అఘాయి త్యాలు జరిగాయని ఒప్పుకుంటూనే ఇప్పుడు నల్లజాతి పాలనలో శ్వేతజాతీయుల్ని ఆ మాదిరేహింసిస్తున్నారని చెప్పుకొచ్చారు. మీ వద్ద ఆధారాలున్నాయా అని రాంఫోసా అడిగితే, లేవని అంగీ కరిస్తూనే ట్రంప్ ఒక వీడియో ప్రదర్శించారు. అందులో నల్లజాతి వామపక్ష నాయకుడు జూలియస్ మలేమా 'శ్వేతజాతి ఆఫ్రికన్లను హతమార్చండ'ంటూ నినాదాలిస్తున్న దృశ్యాలు కనబడ్డాయి. మొత్తం గంటసేపు జరిగిన ఈ మీడియా సమావేశంలో రాంఫోసా ఎక్కడా ఆవేశానికి పోకుండాఎంతో సంయమనంతో ట్రంప్‌కు జవాబిచ్చే ప్రయత్నం చేశారు. నిజానికి దక్షిణాఫ్రికాలో ఇప్పటికీ నాలుగింట మూడొంతుల వ్యవసాయ భూములు 8 శాతంకన్నా తక్కువ జనాభాగల శ్వేతజాతీయుల చేతుల్లో వున్నాయి. జనాభాలో 80 శాతంగా వున్న నల్లజాతీయులకు వ్యవసాయ భూముల్లో వాటా కేవలం 4 శాతం మాత్రమే. కానీ ట్రంప్ మాత్రం దక్షిణాఫ్రికా ప్రభుత్వం శ్వేతజాతీయుల భూముల్ని గుంజుకుని వాటిని నల్లజాతీయులకు పంచు తున్నదని ఆరోపించారు. శ్వేతజాతి దురహంకార పాలనలో నల్లజాతీయుల నుంచి అక్రమంగా చేజిక్కించుకున్న భూములు వెనక్కిప్పించాలని స్థానికులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా అక్కడి ప్రభుత్వం అంగీకరించటం లేదు. దానికి బదులు స్వచ్ఛందంగా అమ్మటానికి సిద్ధపడే శ్వేత జాతీయులకు పలు రాయితీలిస్తున్నది. శ్వేతజాతి రైతుల ఊచకోత సాగుతున్నదన్న ట్రంప్ వాదన కూడా పూర్తి అబద్ధం. నేరాల రేటు చూస్తే ప్రపంచంలోనే దక్షిణాఫ్రికా ముందుంది. అక్కడ సగటున రోజుకు 72 హత్యలు జరుగుతాయి. ఆరుకోట్ల జనాభాగల ఆ దేశంలో హతుల్లో అత్యధికులు నల్లజాతీయులు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం నిరుడు 26,232 మంది హత్యకు గురైతే అందులో కేవలం 8 మంది మాత్రమే శ్వేతజాతి రైతులు. వాస్తవాలు ఇవికాగా ట్రంప్ వైట్‌హౌస్ వేదికగా ఒక దేశాధినేతపై ప్రపంచమంతా చూస్తుండగా దబాయించటం ఎంత దారుణం! నిజానికి రెండు దేశాలూ చర్చించి పరిష్కరించుకోవాల్సినవి చాలావున్నాయి. శ్వేతజాతి రైతుల ఊచకోత ప్రచారాన్ని నమ్మటంతో బైడెన్ హయాంలోనే నిధులు ఆపేశారు. ట్రంప్ వచ్చాక 25 శాతం సుంకాల విధింపును ప్రకటించారు. ఆ దేశంలోని సహజ వనరులపై ట్రంప్ కన్నుపడింది. వీటిపై అర్థవంతమైన చర్చలు జరగకుండానే తప్పుడు ప్రచారంపై వాదులాట సాగింది. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న ఊచ కోతపై ధైర్యంగా అంతర్జాతీయ న్యాయస్థానం తలుపుతట్టింది దక్షిణాఫ్రికాయే. రాంఫోసా అదృష్టం బాగుండి ట్రంప్‌కు ఆ సంగతి గుర్తురాలేదు. లేకుంటే మరింతగా విరుచుకుపడేవారు. వర్తమాన ప్రపంచంలో పలు దేశాధినేతలు తప్పుడు సమాచారాన్నీ, వదంతుల్నీ ప్రచారంలో పెట్టి అధికారంలోకొచ్చినవారే. ఈ ఎత్తుగడలే మరోసారి అందలం ఎక్కిస్తాయని... రాజ్యాంగాన్ని సవరించి మూడోసారి అధ్యక్షుడు కావాలని కలగంటున్న ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఇలాంటపుడు అమెరికాలో అడుగుపెట్టడానికీ, ట్రంప్‌తో చీవాట్లు తినటానికీ ఏ దేశాధినేతయినా ధైర్యం చేయగలరా?

# కరోనా కేసులు పెరుగుతున్నాయ్.. జర జాగ్రత్త..! రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్..




కనుమరుగై పోయిందనుకుంటున్న వేళ కరోనా రీ ఎంట్రీ మళ్లీ కలకలం రేపుతోంది. కొత్త రూపంలో పంజా విసురుతోంది. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులే అందుకు నిదర్శనం. పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా పట్టణాల్లోనే కరోనా కేసులు నమోదు అవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రెండు కొత్త వేరియంట్లలో కరోనా ప్రభావం చూపిస్తున్నట్లు ఇండియన్ జీనోమిక్స్ కన్సార్టియం నిపుణులు గుర్తించారు. %చీదీ.1.8.1, ఞఖీ%.7 అనే కరోనా వేరియంట్స్ ను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే.. జేఎన్.1 వేరియంట్ కేసులు నమోదయ్యాయి.. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీలో కేసులు పెరుగుతున్న దృష్ట్యా.. అప్రమత్తంగా ఉండాలని.. అన్ని సౌకర్యాలతో ఆస్పత్రులను సిద్ధం చేసుకోవాలంటూ అధికారులు సూచనలు జారీ చేశారు. కాగా.. దేశంలోనే అత్యధికంగా కేరళలో కరోనా ఇన్‌ఫెక్షన్లు వెలుగులోకి వస్తున్నాయి. కేరళలో 200మందికి పైగా కరోనా లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. దాంతో.. ఆస్పత్రుల్లో మాస్కులు తప్పనిసరి చేసింది కేరళ ప్రభుత్వం.. మహారాష్ట్రలోనూ కరోనా కేసుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఒక్క ముంబైలోనే ఈ నెలలో 95 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కర్నాటకలో 35 కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఢిల్లీలో 24 గంటల్లో 23 కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో కరోనా కేసులు నమోదు అవుతుండగా.. నోయిడాలో తొలి కరోనా కేసు రికార్డ్ అయింది. గాజియాబాద్‌లో ఇప్పటికే 4 కేసులు నమోదు అయ్యాయి. తమిళనాడులో సైతం కేసులు పెరుగుతున్నాయి.. దీంతో ఆయా ప్రభుత్వాలు ఇప్పటికే అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. భారతదేశంలో రెండు కొత్త %జూం×఑%-19 వేరియంట్లు %- చీదీ.1.8.1, ఞఖీ.7 -% కనుగొనబడ్డాయని.. ఇప్పటివరకు దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.. కనీసం 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేసులు వెలుగు చూశాయి. ఇదిలాఉంటే.. కోవిడ్ సంబంధిత లక్షణాలతో ఇప్పటివరకు ఐదుగురు మరణించినట్లు పేర్కొంటున్నారు. దీనిపై అధికార సమాచారం రావాల్సి ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో 5 కేసులు..

తెలుగు రాష్ట్రాల్లోనూ మళ్లీ కరోనా కలవరం మొదలైంది. తెలంగాణలో తొలి కరోనా కేసు నమోదైంది. కూకట్‌పల్లిలో ఓ డాక్టర్‌కు కరోనా పాజిటివ్ అని తేలింది. బాధితుడిలో జలుబు, దగ్గు, జ్వరం లాంటి లక్షణాలు గుర్తించారు. అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం.. గాంధీ ఆస్పత్రిలో 25 పడకల వార్డును సిద్ధం చేసింది. ఏపీని కూడా కరోనా కేసులు టెన్షన్ పెడుతున్నాయి. విశాఖలో 2 కరోనా కేసులు, కడపలో రెండు కేసులు నమోదవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. అలెర్ట్ అయిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు.. విశాఖ జీజీహెచ్‌లో కరోనా ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు.

రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్..

ఇక.. దేశంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో అన్ని రాష్ట్రాలను కేంద్రం అలెర్ట్ చేసింది. ముందు జాగ్రత్తగా ఆస్పత్రులు సిద్ధం చేయాలని ఆదేశించింది. అయితే.. ఆయా రాష్ట్రాల్లోని కరోనా బాధితులకు కేవలం స్వల్ప లక్షణాలు మాత్రమే ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. బాధితుల్లో ఎక్కువ మంది ఇంట్లోనే చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపింది. భయపడాల్సిన అవసరం లేదని సూచించింది.

# జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!



భారతదేశం తన సత్తా మరోమారు చాటింది. ప్రపంచంలోని అగ్ర దేశాలకు పోటీ ఇస్తూ భారత్ అన్ని రంగాలలోనూ దూసుకుపోతోంది. ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించింది. జపాన్ దేశాన్ని వెనక్కి నెట్టిన భారత్ ఇప్పుడు గర్వంగా అగ్రదేశాల చెంత నిలిచింది. 4ట్రిలియన్ డాలర్లకు భారత ఆర్థిక వ్యవస్థ నాలుగు ట్రిలియన్ డాలర్లకు భారత ఆర్థిక వ్యవస్థ చేరుకోవడం ప్రతి ఒక్కరికి సంతోషం కలిగిస్తుంది. ఇప్పటివరకు 4వ స్థానంలో ఉన్న జపాన్ ను వెనక్కి నెట్టి భారత్ ఆ స్థానాన్ని దక్కించుకొని నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవడం గర్వించదగ్గ అంశమని ఈ విషయం తెలిసిన ప్రతి ఒక్కరూ ఫీలవుతున్నారు. భారతదేశం ప్రపంచ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని నీతి అయోగ్ ప్రకటించింది.

నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

నీతి అయోగ్ సీఈవో బివిఆర్ సుబ్రహ్మణ్యమ్ ఈ మేరకు తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం మనకంటే అమెరికా, చైనా, జర్మనీలు మాత్రమే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయని ఇప్పుడు మనం నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అనుసరిస్తున్న ప్రణాళికను కొనసాగిస్తూ ఇదే విధంగా రెండున్నర, మూడు ఏళ్లలోపు ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

సత్తా చాటుతున్న భారత్

2010 సంవత్సరంలో భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో పదవ స్థానంలో ఉందని, 2019 నాటికి బ్రిటన్ వెనక్కి నెట్టి ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఆయన వెల్లడించారు. ఆరు సంవత్సరాల కాలంలో నాలుగు స్థానాలు పైకి ఎగబాకి భారత్ తన సత్తా చాటింది అని పేర్కొన్నారు.

శరవేగంగా భారత్ ఆర్థిక అభివృద్ధి

2026 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ అంచనాలు దాదాపు 4187.017 డాలర్లకు చేరుకుంటుందని ఇప్పటికే %ఆఎంట% వరల్డ్ ఎకనామిక్ అవుట్ లుక్ ఏప్రిల్ ఎడిషన్ నివేదిక ఒక అంచనా వేసింది. ఇక వచ్చే రెండేళ్లలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆ నివేదికలో పేర్కొంది. 2025 సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.2 శాతం 2026లో 6.3 శాతం వృద్ధి నమోదు చేస్తాయని అంచనా ఉంది.

కవిత కొత్త పార్టీ పెడితే సక్సెస్ అవుతుందా? పబ్లిక్ టాక్ ఎలా ఉందంటే!

జపాన్ ను ఓవర్ టేక్ చేసిన భారత్

భారత ఆర్థిక అభివృద్ధికి భారతదేశ జనాభా ఎంతగానో దోహదపడుతున్నట్టు నీతి అయోగ్ సీఈఓ వెల్లడించారు. వేగంగా అభివృద్ధి చెందే దేశంగా భారతదేశం మారిందని, 30 సంవత్సరాల కాలంలో భారత్ ఆర్థికంగా ప్రగతి సాధించడానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి జపాన్ దేశాన్ని ఓవర్ టేక్ చేసి భారత్ శరవేగంగా దూసుకుపోవడం ఇప్పుడు ప్రతి ఒక్కరికి సంతోషం కలిగిస్తుంది.

# జగన్ అరెస్ట్ కు 'అక్కడే బ్రేక్' - ఊహించని రాజకీయం..!?





ఏపీ రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తవుతోంది. ఇటు వైసీపీ నేతల పైన వరుస కేసులు నమోదు అవుతున్నాయి. లిక్కర్ కేసులో వైసీపీ ముఖ్య నేతలకు ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే పలువురు అరెస్ట్ అయ్యారు. జగన్ సైతం ఈ కేసులో అరెస్ట్ ఖాయం అంటూ పెద్ద ఎత్తున పొలిటికల్ సర్కిల్స్ లో ప్రచారం సాగుతోంది. జగన్ ఈ అరెస్ట్ వార్తలపైన స్పందించారు. తాను విజయవాడలోనే ఉన్నానని.. ఎవరు అడ్డుకున్నారని ప్రశ్నించారు. అయితే, జగన్ అరెస్ట్ సాధ్యమేనా.. ఏం జరుగుతోంది.

### జగన్ అరెస్ట్ పై

లిక్కర్ కేసు ఏపీలో సంచలనంగా మారుతోంది. సిట్ విచారణ లో భాగంగా జగన్ సన్నిహితులు పలువురు ఇప్పటికే అరెస్ట్ అయ్యారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో అన్నీ తామై వ్యవహరించి న మాజీ ఐఏఎస్ ధనుంజయ రెడ్డి, ఓఎస్డీ క్రిష్ణమోహన్ రెడ్డి అరెస్ట్ తో ఈ కేసు కీలక మలుపు తీసు కుంది. ఇదే సమయంలో ఈడీ ఈ కేసులో జోక్యం చేసుకోవటం మరో ఆసక్తి కర పరిణామం. ఇటు జగన్ అరెస్ట్ ఖాయమంటూ ప్రచారం సాగుతోంది. తాజాగా మీడియా సమావేశంలో ఇదే అంశం పైన స్పందించిన జగన్ తాను విజయవాడలోనే ఉన్నానని.. ఎవరు అడ్డుకుంటున్నారని.. వెల్ కం అంటూ వ్యాఖ్యానించారు. అటు మంత్రివర్గ సమావేశ సమయంలో లిక్కర్ స్కాం పైన ఎవరూ మాట్లాడ వద్దని మంత్రులకు చంద్రబాబు నిర్దేశించారు.

### విచారణలో కీలకంగా

లిక్కర్ కేసు విచారణ.. అరెస్ట్ లు పైన జగన్ కీలక వ్యాఖ్యలు చేసారు. లిక్కర్ కేసులో సీఎంఓ కు ఒక్క ఫైల్ వచ్చిందని.. ఒక్క సంతకం ఉందని చంద్రబాబు నిరూపించగలరా అంటూ సవాల్ చేసారు. ధనుంజయ రెడ్డి అసలు ఎక్సైజ్ వ్యవహారాలు పర్యవేక్షించలేదని జగన్ చెప్పుకొచ్చారు. కాగా, మరో వైపు లిక్కర్ కేసు విచారణలో భారీగా లావా దేవీలకు సంబంధించి ఆధారాలు దొరికి నట్లు కథనాలు ప్రచురితం అవుతున్నాయి. అయితే, జగన్ ప్రమేయం పైన ఎలాంటి ఆధారాలు ఉన్నాయనేది ఇప్పుడు కీలకంగా మారుతోంది. మద్యం వ్యవహారాల్లో తాను ఎక్కడా సంతకం చేయ లేదని చెబుతున్న జగన్.. పరోక్షంగా వస్తున్న ఆరోపణల్లో తనకు ఎలాంటి ప్రమేయం లేదని సంకే తాలు ఇచ్చే ప్రయత్నం చేసారు. అయితే.. కేసులో ఇప్పటికే కసిరెడ్డి, బాలాజీ గోవిందప్ప, వాసుదేవరెడ్డి ఇచ్చిన స్టేట్మెంట్స్ ఆధారంగా జగన్ అరెస్ట్ కు సిద్ధ పడతారా లేదా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

### రాజకీయ ప్రభావం

వారిచ్చిన స్టేట్మెంట్స్ ఆధారంగా అరెస్ట్ చేస్తే.. న్యాయ స్థానాల్లో ఎంత మేర బలంగా నిలబడ తా యనేది కీలక అంశంగా మారుతోంది. ఏపీలో మూడు పార్టీల కూటమి ప్రభుత్వం కొనసాగుతోంది. జగన్ అరెస్ట్ వంటి అంశంలో మూడు పార్టీల అభిప్రాయం కూడా కీలకం కానుంది. జగన్ అరెస్ట్ ద్వారా రాజకీయంగా చోటు చేసుకునే పరిణామాల పైనా చర్చ జరుగుతోంది. బీజేపీ ముఖ్య నేతల తో ఈ అంశం పైన చర్చల వేళ.. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని నిర్ణయం పైన ముందుకు వెళ్లాలని సూచించినట్లు ప్రచారం సాగుతోంది. రాజకీయంగా జగన్ కు ఏ చిన్న అవకాశం ఇవ్వ కూడదనేది కూటమి ముఖ్యుల ఆలోచన. జగన్ ను అరెస్ట్ చేసినా.. బెయిల్ పైన బయటకు వచ్చిన తరువాత రాజకీయంగా తీసుకునే నిర్ణయాలు.. ప్రజా స్పందన పైనా అంచనా వేస్తున్నారు. దీంతో, పూర్తి స్థాయి ఆధారాలు.. భవిష్యత్ పరిణామాల పైన ఒక స్పష్టతకు వచ్చిన తరువాతనే జగన్ అరెస్ట్ విషయంలో నిర్ణయం జరిగే అవకాశం ఉందని కూటమి నేతలు భావిస్తున్నారు.

## మహారాష్ట్రను చేరుకున్న నైరుతి రుతుపవనాలు : ఐఎండి




న్యూఢిల్లీ : నైరుతి రుతుపవనాలు మహారాష్ట్రను చేరుకున్నాయని, రాబోయే రెండు మూడురోజుల్లో ముంబయి సహా మరికొన్ని ప్రాంతాలకు విస్తరిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఆదివారం తెలిపింది. రుతుపవనాలు ఆదివారం అరేబియా మహాసముద్రం, కర్ణాటక, గోవా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, ఉత్తర బంగాళాఖాతం మరియు మిజోరంలోని కొన్ని ప్రాంతాలు, మణిపూర్, నాగాలాండ్‌లలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించాయని ఐఎండి పేర్కొంది. రాబోయే మూడు రోజుల్లో మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, ముంబయితో సహా మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాలు, బెంగళూరుతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, తమిళనాడులోని మిగిలిన ప్రాంతాలు, పశ్చిమ-మధ్యమరియు ఉత్తర బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలు, ఈశాన్యరాష్ట్రాల్లోని మరికొన్ని ప్రాంతాలకు తుఫాను ముంచుకువచ్చేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వెల్లడించింది. రుతుపవనాలు ఉత్తరాదిన దేవ్‌గడ్, బెలగావి, హవేరి, మాండ్య, ధర్మపురి, చెన్నై, ఐజ్వాల్, కొహిమా గుండా పయనిస్తున్నాయని తెలిపింది. రుతుపవనాలతో మహారాష్ట్రలోని కోస్తా తీర ప్రాంతాలు కొంకణ్ మరియు ముంబయిలలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. 2009లో మే 23న కేరళకి చేరుకున్న రుతుపవనాలు, ఈ ఏడాది మరోసారి ముందుగా మే 24న భారత్‌ను పలకరించాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1నాటికి కేరళను తాకి, జులై నాటికి దేశం మొత్తం విస్తరిస్తాయి.

## పహల్గాం ఉగ్రదాడి బాధితులపై బిజెపి ఎంపి వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్



న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి బాధితులపై బిజెపి ఎంపి రామ్‌చందర్ జాంగ్రా వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమైనవని కాంగ్రెస్ పేర్కొంది. ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ ఆదివారం ప్రకటించింది. బిజెపి ఎంపిని పదవినుండి తొలగించాలని, ఈ విషయంలో ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలని ఆదివారం డిమాండ్ చేసింది. పహల్గాం ఘటన, ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై మధ్యప్రదేశ్ మంత్రి విజరుషా, ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జగదీష్ దేవ్డాలు అనుచిత, గర్హణీయ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం బాధితులను, సాయుధ దళాలను అప్రతిష్టపాలు చేయడానికి బిజెపి నేతలు ఒకరితో ఒకరు పోటీపడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. బిజెపి ఎంపి రామ్‌చందర్ జాంగ్రా సిగ్గుచేటు ప్రకటన మరోసారి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల సంకుచిత మనస్తత్వాన్ని బయటపెట్టిందని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన నావికాదళ అధికారి భార్యను సోషల్‌మీడియాలో ట్రోల్ చేశారని, అప్పుడు కూడా ప్రధాని మౌనంగా ఉన్నారని అన్నారు. " ప్రధాని మోడీజీ.. మీ నరాల్లో సిందూరం ప్రవహిస్తోందని మీరు అంటున్నారు. అలాంటపుడు మహిళల గౌరవానికి భంగం కలిగే అసభ్యకరంగా మాట్లాడుతున్న మీ నాయకులను ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. బిజెపి భారత సైన్యాన్ని మరియు అమరవీరులను నిరంతరం అవమానిస్తున్నారని, ఇది వారి సంకుచిత, నీచమైన మనస్తత్వాన్ని వెల్లడిస్తుందని కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ మండిపడ్డారు. జంగ్రా చేసిన ఈ సిగ్గుచేటు ప్రకటన, అధికార గర్వంతో ఉన్న బిజెపి సంకుచిత మనస్తత్వాన్ని చూపుతోందని అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో భద్రతా లోపాన్ని ఎత్తిచూపడానికి బదులుగా బిజెపి ఎంపి అమరవీరులను, వారి భార్యలను నిలదీస్తున్నారని అన్నారు. విజరుషా, దేవ్డాలపై బిజెపి ఎటువంటి చర్యలు తీసుకోలేదని, తాజా ప్రకటన తీవ్ర అభ్యంతరకరం అని అన్నారు. ప్రధాని మోడీ, బిజెపి నాయకత్వం మౌనం వహించడాన్ని ఈ ప్రకటనలకు మౌనంగా ఆమోదం తెలిపినట్లుగా ఎందుకు పరిగణించకూడదని ప్రశ్నించారు. ఈ సిగ్గుచేటు ప్రకటనకు ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలని అన్నారు. ఎంపిని బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడికి గురైన పర్యాటకులు పోరాటం చేసి ఉండాల్సిందని, భర్తలను కోల్పోయిన మహిళలు యోధుల్లాగా వ్యవహరించాల్సిందని శనివారం జాంగ్రా అనుచిత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. పర్యాటకులు అగ్ని వీర్ శిక్షణ పొంది ఉంటే మరణాల సంఖ్య తక్కువగా ఉండేదని, మహిళల్లో యోధుల స్ఫూర్తి లోపించిందని అన్నారు.

## మిస్ ఇంగ్లండ్ ఆరోపణలపై స్పందించిన కెటిఆర్



హైదరాబాద్: తెలంగాణలో మొదటిసారిగా జరుగుతున్న మిస్ వరల్డ్-2025 పోటీల నుంచి వైదొలగుతున్నట్లు మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆమె ఈ పోటీల నిర్వహణపై సంచలన ఆరోపణలు చేశారు. నిర్వహకులు పోటీదారులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని. తాను వేశ్యననే భావనను కలిగేలా పరిస్థితులు నిర్వాహకులు ప్రవర్తించారని బాంబు పేల్చారు. దీంతో ఈ వివాదం తీవ్ర రూపం దాల్చింది. మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై కెటిఆర్ స్పందించారు. మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని ఎక్స్ వేదికగా కెటిఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉందని ఆయన అన్నారు. తెలంగాణలో మహిళలను గౌరవిస్తామని.. వారి అభివృద్ధికి సమాన హక్కులు కల్పిస్తామని తెలిపారు. రాణి రుద్రమ, చిట్యాల ఐలమ్మ వంటి మహిళలు పుట్టిన నేల ఇది అని ఆయన అన్నారు. మహిళలకు అవమానం జరగడాన్ని తెలంగాణ అంగీకరించదు.ఒక ఆడపిల్ల తండ్రిగా ఇలాంటి అనుభవాలు జరగకూడదని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

## పోను అని చెప్పి.. అందిరికంటే ముందే పోయి కూర్చుండు




హైదరాబాద్: కాంగ్రెస్, బిజెపి పార్టీలపై మాజీ మంత్రి హరీష్ రావు ఫైరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో నీతి ఆయోగ్ మీటింగ్‌ని బాయ్‌కాట్ చేస్తున్నామని చెప్పి.. ఇప్పుడు అందరికంటే ముందే పోయి అక్కడ కూర్చున్నాడని హరీష్ రావు మండిపడ్డారు.ఇక, తెలంగాణ పట్ల బిజెపికి ఎందుకింత కక్ష అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 మంది బిజెపి ఎంపిలను తెలంగాణ ప్రజలు గెలిపిస్తే.. తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా రాష్ట్రానికి ఒక్క రూపాయి తీసుకురావడం లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రాజెక్టుల నిర్మాణానికి రూ. 1లక్ష 60 వేల కోట్లు కేంద్రం ఇచ్చినప్పుడు, తెలంగాణకు అందులో 1 శాతం కూడా ఎందుకు ఇవ్వడం లేదని హరీష్ రావు ప్రశ్నించారు.

# కశ్మీర్ విద్యార్థులు నేరస్థులా?



ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన మారణకాండను యావద్దేశం గర్హించింది. పర్యాటకులు ఏ మతం వారో పట్టిపట్టి ఆరా తీసి ఉగ్రవాదులు కాల్పులు జరపడం దేశం మొత్తం ముక్తకంఠంతో ఖండించింది. ఇప్పుడు అదే రీతిలో కశ్మీర్‌లోయ కాకుండా బయట ఉత్తరాది ప్రాంతాల్లో కశ్మీరీలపై దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది. కశ్మీరీ అయితే చాలు వారి దాడులకు బలైనట్టే. ఈ దాడులకు పాల్పడుతున్న వారికి ఉగ్రవాదులకు తేడా ఏం లేదు. పహల్గాం ఉగ్రదాడితో ఎలాంటి సంబంధం లేకపోయినా, విద్యార్థులను, వ్యాపారులను నేరస్థులుగా ఇతర ప్రాంతాల్లో అనుమానించడం, దాడులు చేయడం తరచుగా జరుగుతున్నాయి. పహల్గాం సంఘటన జరిగిన ఆరురోజుల్లోనే ఈవిధంగా దేశం మొత్తం 17 సంఘటనలు జరిగాయి. ఎక్కువగా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో ఒక వర్గానికి చెందిన మితవాద వర్గాల దురుసుతనమే ఈ సంఘటనల వెనుక కనిపిస్తోంది. పంజాబ్‌లో కశ్మీర్ విద్యార్థులను క్యాంపస్‌లోనే కర్రలతో, పదునైన ఆయుధాలతో దాడి చేశారు. ఉత్తరాఖండ్‌లో కాలేజీలనుంచి వెళ్లిపోవాలని బెదిరించారు. ఢిల్లీలో జామియా, మిలియా ఇస్లామియా విద్యార్థిపై దౌర్జన్యం చేశారు. హిమాచల్‌ప్రదేశ్, ముస్సోరీలో కశ్మీరీ శాలువాలు విక్రయించే వ్యాపారులపై దాడులు జరిగాయి. కశ్మీర్‌లో ఏదైనా హింస జరిగితే కశ్మీరీలంతా అనుమానితులవుతుండడం పరిపాటిగా సాగుతోంది. పహల్గాం ఉగ్రదాడి బాధాకరమైన వాస్తవాన్ని వెల్లడించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకుంటున్న కశ్మీర్ విద్యార్థులకు భద్రత గాలిలో దీపంలా తయారైంది. దేశంలో వీరికి భద్రత కల్పించే పటిష్టమైన, వ్యవస్థాపరమైన యంత్రాంగం లేదు. అలాగని వారి భద్రతను ప్రజల భావోద్వేగాలతో మారుతున్న అభిప్రాయాలకు విడిచిపెట్టకూడదు. పహల్గాం వంటి దాడులకు పాల్పడే ముష్కరుల లక్ష్యం కేవలం చంపడమే కాదు, సమాజాన్ని చీల్చడం, ప్రజల్లో నమ్మకాన్ని పోగొట్టడం, సామాజిక సామరస్యాన్ని విచ్ఛిన్నం చేయడం, సామాజిక వర్గాల్లో అనుమానాలను ప్రేరేపించడం. ఈ నేపథ్యంలో మనం స్పష్టంగా తెలుసుకోవలసింది కశ్మీరీ విద్యార్థులను హింసించడం దేశభక్తిలో భాగం కాదు. దేశాన్ని అంతర్గతంగా చీల్చాలనుకుంటున్న వారికి విద్యార్థులను దాసోహం చేయడమే అవుతుంది. ఈ హింసాకాండలు కొత్తేమీ కావు. కశ్మీర్ లోయలో ఏదైనా హింసాత్మక సంఘటన జరిగినా లేదా సైనికులు ముష్కరులకు బలైపోయినా, కశ్మీరీ విద్యార్థులకే తరచుగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. చాలా మంది విద్యార్థులు పేదరికంతోను, సంఘర్షణలతోను సతమతమవుతున్నా ఉన్నత చదువుల ద్వారా చక్కని భవిష్యత్ కోసం నిరీక్షిస్తున్నారు. వీరికి అన్ని విధాలా సహకారం అందడానికి బదులు కేవలం కశ్మీరీ అయినందున నేరస్థులుగా అనుమానించడం శోచనీయం. యూనివర్శిటీలు, ఇతర విద్యాసంస్థలు వీరిని పీడించే బందిఖానాలుగా మారుతుంటే పాలనా యంత్రాంగాలు పట్టించుకోవడం లేదు. కాలేజీ నిర్వాహకులు, చట్టాలు, పౌరసమాజం వారిని దేశసంక్షోభ సమయాల్లో బలిపశువులు కాకుండా చూడాలి. వారి ఫిర్యాదులను పరిష్కరించే అధికారులను నియమించాలి. వివక్షకు తావు లేని విధానాలు అమలు చేయాలి. స్థానిక పోలీస్‌ల సహకారంతో వారికి మూకుమ్మడి దాడులనుంచి రక్షణ కల్పించాలి. విధానాలకు అతీతంగా వారి మానసిక క్షోభను నివారించే ప్రయత్నం చేయాలి. క్లిష్ట పరిస్థితుల్లో ఈ విద్యార్థులు తీవ్ర ఆవేదనకు, మానసిక నైరాశ్యానికి గురవుతున్నారు. దేశం పట్ల వారు తమ విధేయతను నిరూపించుకునేలా అవకాశం కల్పించాలి. దేశంలోని మరే ఇతర విద్యార్థి వర్గాలకు ఇలాంటి దుస్సంఘటనలు ఎదురు కాకుండా చూడాలి. ఇలాంటి చర్యలు తీసుకోకుంటే విద్యార్థుల్లో భయం పెరిగి, తమ గుర్తింపు ఎవరికీ తెలియకుండా కాలేజీ క్యాంపస్‌ల్లో దాక్కొనే పరిస్థితి ఏర్పడుతుంది. తమ బాధలు ఎవరికీ చెప్పుకోలేక సుదీర్ఘకాల ఆందోళనలో మగ్గిపోవలసి వస్తుంది. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది జ్ఞాపకాలను నిజంగా మనం మన్నించాలనుకుంటే మతపరమైన ప్రతీకార ఉచ్చులో మనం ఇరుక్కోకూడదు. సంస్థాగత సంకల్పానికి మనం స్పందించాలి. అంతర్గతంగా సాగుతున్న ఈ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలి. క్లిష్టపరిస్థితుల్లో కశ్మీరీ విద్యార్థులకు ఎక్కడా, ఏ విద్యాసంస్థల్లోనూ వేధింపులు, బెదిరింపులు, దాడులు ఎదురు కాకుండా ఒక జాతీయ స్థాయి విద్యావిధానాన్ని అమలు చేయడం తప్పనిసరి. సామాజిక, సామరస్య వాతావరణాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఒక హింసాత్మక సంఘటన చాలన్న ముష్కరుల జోస్యానికి అవకాశం ఇవ్వరాదు. హింసకు మన సమాధానం ఐక్యత తప్ప పగ, ప్రతీకారం కారాదు. మనబలం కరుణే తప్ప ప్రతిదాడి కారాదు. కశ్మీరీ విద్యార్థులు కోరుకునేది మన నుంచి అనుమానం కాదు, మనం అందించే సంఘీభావం. ఇప్పుడు మనకు కావలసింది కశ్మీరీ విద్యార్థులకు పటిష్టమైన భద్రతా చర్యలు కల్పించడం. అమాయకులైన యువత నేరారోపణకు బలికాకుండా వారిని రక్షించుకోవడానికి మనం కృతనిశ్చయులమై ఉండాలి. పహల్గాం దాడి సమయంలో వివిధ ప్రాంతాల పర్యాటకులను కులమతాలకు అతీతంగా ఆదరించి అక్కున చేర్చుకున్నది కశ్మీర్ ముస్లింలే అన్న వాస్తవాలను మరిచిపోరాదు. బాధితులకు ఆపన్నహస్తం అందించిన కశ్మీర్ లోయపైన, అక్కడి ప్రజలపైన, విద్యార్థులపైన ఎక్కడైనా వివక్ష చూపించడమంటే మనకు మనం శత్రువులం కావడమే.

# అమెరికా ప్రతిష్ఠకే తీరని నష్టం



ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్శిటీలో విద్యార్థుల ప్రవేశాన్ని ట్రంప్ ప్రభుత్వం నిషేధించడం అక్కడ ప్రస్తుతం చదువుతున్న వేలాది మంది విదేశీ విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంలో పడింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్ నగరాల్లో ఉన్న క్యాంపస్‌ల్లో 6800 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తోంది. దాదాపు 100కు పైగా దేశాల నుంచి విద్యార్థులు ఇక్కడ ఏటా ప్రవేశం పొందుతున్నారు. ప్రస్తుతం హార్వర్డ్ యూనివర్శిటీలో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన మొత్తం 10,158 మంది విదేశీ విద్యార్థులు చదువుతున్నారు. 202425 విద్యా సంవత్సరంలో ఈ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో కలిపి 788 మంది భారతీయ విద్యార్థులు నమోదయ్యారు. ప్రస్తుతం ఇక్కడ చదువుతున్న విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం తరువాత ఇతర విశ్వవిద్యాలయాలకు బదిలీ కావలసిన గందరగోళ పరిస్థితి ఏర్పడింది. లేకుంటే వారు చట్టబద్ధతను కోల్పోయే ప్రమాదం తప్పదు. అయితే తాము విధించిన ఆరు షరతులకు యూనివర్శిటీ అంగీకరిస్తే విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని యథాతథంగా కొనసాగించవచ్చని ట్రంప్ సర్కారు మెలిక పెట్టింది. ట్రంప్ ఆదేశాలను సవాలు చేస్తూ హార్వర్డ్ యూనివర్శిటీ ఫెడరల్ కోర్టులో దావా వేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన బోస్టన్‌లోని యుఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి అల్లిసన్ బుర్రోగ్స్ శుక్రవారం ట్రంప్ యంత్రాంగం జారీ చేసిన నిషేధాజ్ఞలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఏదెలాగైనా హార్వర్డ్ యూనివర్శిటీలో విదేశీ విద్యార్థుల ప్రవేశానికి ఇక వీలు లేనట్టే. ప్రస్తుతం అక్కడ చదువుతున్న విదేశీ విద్యార్థులు వేరే యూనివర్శిటీకి బదిలీ కావాలి. లేకుంటే వారిని అక్రమ ప్రవాసులుగా పరిగణించాల్సి వస్తుందని అమెరికా అంతర్గత భద్రతా విభాగం హెచ్చరిస్తోంది. ట్రంప్ సర్కారు ఉత్తర్వుల ప్రకారం స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (ఎస్ఇవిపి) సర్టిఫికేషన్ రద్దు చేయడంతో ఎఫ్1 లేదా జే1 వీసా కింద విదేశీ విద్యార్థులకు ఈ యూనివర్శిటీలో ప్రవేశార్హత ఉండదు. ట్రంప్ సర్కారు తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. 140 పైచిలుకు దేశాలనుంచి వచ్చే విద్యార్థులు, మేధావులకు, బోధకులకు ఆతిథ్యమిచ్చే సామర్థం హార్వర్డ్ యూనివర్శిటీకి ఉందని, దీన్ని సజావుగా కొనసాగించడానికి తాము కట్టుబడి ఉన్నామని హార్వర్డ్ ప్రతినిధ జాసన్‌న్యూటన్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ విదేశీ ప్రతిభావంతులు యూనివర్శిటీని, దేశాన్ని సుసంపన్నం చేస్తున్నారని ఉదహరించారు. భారత విద్యార్థుల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఏటా ఏకంగా 900 కోట్ల డాలర్ల మేరకు ఆదాయం సమకూరుతోందని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ విద్యా సలహాదారు అజయ్ భుటోరియా గుర్తు చేశారు. ఇన్నోవేషన్, టెక్నాలజీ, వైద్య తదితర రంగాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉండటం వెనుక భారత విద్యార్థుల కృషి ఎనలేనిదన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు రెడ్‌కార్పెట్ పరిచేందుకు బ్రిటన్, కెనడా దేశాలు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హాంగ్‌కాంగ్‌లోని ఒక విశ్వవిద్యాలయం.. హార్వర్డ్‌లో తదుపరి విద్యాసంవత్సరం కొనసాగించలేని విద్యార్థుల కోసం హాంగ్‌కాంగ్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయం చేస్తామని తెలియజేసింది. హార్వర్డ్ వర్శిటీ విదేశీ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం నిషేధం ప్రకటించడంపై చైనా తీవ్రంగా విమర్శలు చేసిన వెంటనే హాంకాంగ్ యూనివర్శిటీ ఈ అవకాశాన్ని ప్రకటించడం గమనార్హం. ప్రస్తుతం హార్వర్డ్‌లోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో 1000 కంటే ఎక్కువ సంఖ్యలో చైనా విద్యార్థులు చదువుతున్నారు. హార్వర్డ్ క్యాంపస్‌లో గత సంవత్సరం చైనీస్ పారామిలిటరీ గ్రూప్ సభ్యులకు శిక్షణ ఇచ్చారని అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఆరోపించడం ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. అలాగే అమెరికా వ్యతిరేక, ఉగ్రవాద సమర్థకులు యూదు విద్యార్థులను వేధించడం, దాడి చేయడానికి హార్వర్డ్ క్యాంపస్‌లో అనుమతించడం జరిగాయని అమెరికా ప్రభుత్వం ఆరోపించింది. మొత్తం మీద అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రాచీన ప్రఖ్యాత విద్యాసంస్థ హార్వర్డ్‌ను చిక్కుల్లో పెడుతున్నారు. యూనివర్శిటీకి మంజూరయ్యే కొన్ని మిలియన్ల డాలర్ల నిధులను గ్రాంట్లను స్తంభింప చేశారు. ప్రపంచం మొత్తం మీద అత్యంత ప్రతిభావంతులను హార్వర్డ్ యూనివర్శిటీ ఆకర్షిస్తోంది. వారు నచ్చి ఎంచుకున్న ఆయా రంగాల్లో ఆరితేరేలా శిక్షణ కల్పిస్తోంది. ఉదార వాదానికి, విజ్ఞాన సృష్టికి, ప్రపంచీకరణను ముందుకు తీసుకు వెళ్లడానికి దోహదం చేస్తోంది. కానీ ఈ యూనివర్శిటీలో మైనారిటీలకు, ముఖ్యంగా ఆఫ్రికన్ అమెరికన్లకు ప్రవేశం లేకుండా నిరోధించే పోకడలు కనిపిస్తున్నాయి. హార్వర్డ్ యూనివర్శిటీ విదేశీ విద్యార్థుల విరాళాలు, ఫీజుల పైనే ఎక్కువగా ఆధారపడుతోందని, వారికి విశేషాధికారాల వీసాలను కల్పిస్తోందని ట్రంప్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ట్రంప్ ఉత్తర్వులకు కోర్టులు తాత్కాలికంగా బ్రేకు వేసినప్పటికీ, ఇప్పుడు జరిగిన నష్టం కేవలం హార్వర్డ్ వర్శిటీకే కాదు, అమెరికా ఉన్నత విద్యాసంస్థల ప్రతిష్టకు, ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు తీరని నష్టం ఏర్పడింది.

# ప్రగతి స్వరానికి పురస్కారం




కన్నడ కథా రచయిత్రి బాను ముస్తాక్‌కు ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ బుకర్ సాహిత్య పురస్కారం లభించటం సంతోషదాయకం. మతపరంగా మహిళలపై కనపడేవిధంగానూ, కనపడకుండానూ సాగే అణచివేత, వివక్షలపై ఆలోచింపచేసే విధంగా రాసిన చిన్ని కథలకు ఈ బహుమతి రావడం ప్రగతి స్వరానికి పట్టాభిషేకం. భారతీయ సాహిత్యకారులకు ఈ అవార్డు రావడం ఇది రెండోసారి. మూడేళ్ల క్రితం గీతాంజలి శ్రీ రచించిన 'ది టూంబ్ సాండ్'కు బుకర్ పురస్కారం వచ్చింది. అణచివేతను స్వయంగా అనుభవించి, అధిగమించి ఆ గాయాల నుంచి తనను తాను రూపుదిద్దుకున్న బాను ముస్తాక్ రచయిత్రి మాత్రమే కాదుబీ న్యాయవాది, సామాజిక కార్యకర్త కూడా. ఎందరో బాధితులకు బాసటగా నిలుస్తున్న బాను సృజియించిన వాస్తవిక కథలకు పురస్కారం లభించటం ద్వారా ఆమె లేవనెత్తిన సమస్యల పైనా ప్రపంచ దృష్టి పడుతుంది. పురుషాధిపత్యం, మత మౌఢ్యం మహిళల అభ్యున్నతికి అడుగడుగునా ఎలా అడ్డు పడతాయో, ధిక్కరించి ముందడుగు వేసినప్పుడు అవి ఎలా ప్రవర్తిస్తాయో ఆమె కథలు కళ్లకు కట్టేలా చెబుతాయి. కర్ణాటకలోని హాసన్ పట్టణంలో నివసించే 77 ఏళ్ల బాను ముస్తాక్ తన జీవితంలో అడుగడుగునా వివక్షను, వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. మత ఛాందసవాదుల తిట్లకు, వెలివేతకు, దాడులకు గురయ్యారు. అయినా సరే ఆమె ఎక్కడా ఎప్పుడూ ధైర్యాన్ని కోల్పోలేదు. తండ్రి, భర్త ఇచ్చిన మద్దతుతో వాటిని గట్టిగా ఎదుర్కొని, జర్నలిస్టుగా, రచయిత్రిగా, న్యాయవాదిగా, హక్కుల కార్యకర్తగా నిలదొక్కుకున్నారు. ప్రతి సందర్భంలోనూ అస్తవ్యస్తతని, అసమానత్వాన్ని ప్రశ్నించటమే తన వ్యక్తిత్వంగా మలచుకున్నారు. ఆ విధంగా ప్రగతిశీల భావాలకు, ఉద్యమాలకు దగ్గరయ్యారు. నిజ అనుభవాల ప్రేరణతోనే కథలు, కవితలు, నవలలు రాశారు. కర్ణాటక సాహిత్య అకాడెమీ, దాన చింతామణి అత్తిమబ్బె వంటి పురస్కారాలను పొందారు. 1990 - 2023 మధ్య రాసిన 'హసీనా - ఇతర కథలు' అన్న 12 కథల సంపుటినే మరొక రచయిత్రి దీపా భస్తీ 'హార్ట్ ల్యాంప్' పేరిట ఆంగ్లంలోకి అనువదించి, ఇంగ్లాండులో ప్రచురించారు. ఆ పుస్తకమే 13 గ్రంథాల లాంగ్‌లిస్టుని, ఆరు ఎంపికల షార్ట్‌లిస్టుని దాటి, ఈ ఏడాది బుకర్ పురస్కారాన్ని గెలుచుకొంది. ఈ బహుమతి కింద లభించే రూ.57 లక్షలను రచయిత్రి, అనువాదకురాలికి చెరో సగం మంగళవారం రాత్రి లండన్‌లో ప్రదానం చేశారు. 'మహిళల జీవన సంఘర్షణలను 'హార్ట్‌ల్యాంప్' కథలు పరిశీలనాత్మకంగా విశ్లేషించాయి.' అని బుకర్ ప్రైజ్ జ్యూరీ పేర్కొంది. 1969లో ప్రారంభించిన ఈ అవార్డులను తొలుత కామన్వెల్త్ దేశాల రచయితలు ఇంగ్లీషులో రాసిన ఫిక్షన్‌కే ఇచ్చేవారు. తరువాతి కాలంలో పురస్కార నగదును, దేశాల విస్తృతిని పెంచుకుంటూ వచ్చారు. 2016 నుంచి ఇంటర్నేషనల్ బుకర్ పేరుతో అన్ని దేశాల రచయితలకు దీనిని వర్తింపచేస్తున్నారు. 'రచనలు ఇంగ్లీషులో ఉండాలి, ఇంగ్లాండు లేదా ఐర్లాండులో మాత్రమే ప్రచురించాలి' అన్న నిబంధన మాత్రం కొనసాగుతోంది. రచన షార్ట్‌లిస్టులోకి వెళ్లినా, సర్వ ప్రథమంగా నిలిచి పురస్కారం పొందినా - ప్రకటించిన మొత్తాన్ని మూల రచయితకు, అనువాదకులకూ సమంగా పంచుతారు. "ప్రపంచంలో ఎవరు, ఎక్కడ, ఎలాంటి సమాజంలో నివసిస్తున్నా మానవ సంవేదనలన్నీ ఒకటే! వాటిని పంచుకోవటం, సహానుభూతి చెందటం సాహిత్యం ద్వారానే సాధ్యమవుతుంది. ఈ పురస్కారం విశ్వ సాహిత్యపు కిటికీలను తెరుస్తుంది." అంటారు బుకర్ ఫౌండేషన్ నిర్వాహకులు. బాను కథల స్వరాన్ని విన్నప్పుడు ప్రపంచంలోని వివిధ సమాజాలపై వివక్షతో కూడిన మతాల పర్యవేక్షణ, ఆధిపత్య ధోరణి పాఠకుల హృదయాలపై కదలాడి తీరతాయి. బుకర్ పురస్కారం పొందటం ద్వారా ఆమె కథలు అంతర్జాతీయ సమాజానికి దగ్గరవుతాయి. అంతరాలను, అసమానతలను ప్రశ్నించే అక్షర స్వరాలకు సంఘీభావాన్ని, సహానుభూతిని సమకూర్చుతాయి. ఎక్కడి అనుభవాన్నయినా ఇక్కడి సంవేదనలతో అనుసంధానించటమే విశ్వ సాహిత్యపు లక్షణం. ఎక్కడెక్కడి మనుషులతోనైనా సుహృద్భావ సంబంధాన్ని, మానవీయ అనుబంధాన్ని కలిగించటమే సాహిత్య ప్రయోజనం, పరమార్థం!

# సినిమా చిత్రం

## స్పై యూనివర్స్ ప్యాక్ రిపీట్.. వార్-2తో ఎలాంటి హిట్ కొడతారో?



యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ కు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఆ యూనివర్స్ నుంచి ఇప్పటికే పలు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చి మెప్పించాయి. ఏక్ థా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్, టైగర్ 3.. స్పై యూనివర్స్ లో భాగంగా రూపొంది మంచి రెస్పాన్స్ ను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు యష్ స్పై యూనివర్స్ లో భాగంగా వార్-2 సినిమా థియేటర్స్ లో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. బాలీవుడ్ ప్రముఖ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్.. నటించిన ఆ మూవీ ఆగస్టు 14వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తవ్వగా.. మేకర్స్ తాజాగా టీజర్ ను రిలీజ్ చేశారు. టీజర్ లో మన తారక్ పవర్ ఫుల్ గా కనిపించారు. నా గురించి తెలియదేమో.. ఇప్పుడు తెలుసుకుంటావ్.. గెట్ రెడీ ఫర్ ద వార్ అంటూ ఎన్టీఆర్ చెబ్నుతున్న డైలాగ్స్, యాక్షన్ సన్నివేశాలతో టీజర్ అందరినీ ఆకట్టుకుంటోంది. సినిమాపై ఓ రేంజ్ లో అంచనాలు పెంచుతోంది. ఒక్కసారిగా అందరి దృష్టిని సినిమా వైపు తిప్పుకుంది టీజర్. అదే సమయంలో సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. స్పై యూనివర్స్ స్టారర్ ప్యాక్ మరోసారి రిపీట్ అయిందని నెటిజన్లు చెబుతున్నారు. సాధారణంగా యష్ స్పై యూనివర్స్ లోని సినిమాల్లో కొన్ని కామన్ పాయింట్స్ ఉంటాయి. ఇద్దరూ స్టార్ నటులు లీడ్ రోల్స్ పోషిస్తారు. హీరోయిన్ బికినీ సీన్, బ్రిడ్జ్ పై నుంచి రైలుపైకి దూకే సీన్ కచ్చితంగా ఉంటాయి. ఇద్దరు నటులు పారాచూట్‌లతో విమా నం నుండి దూకే సన్నివేశంతోపాటు గాలిలోకి దూకి ఒకరి ముఖాలు ఒకరు చూసుకునే సీన్ కంపల్సరీగా ఉంటుంది. ఇప్పుడు వార్-2లో ఆ సీన్స్ అన్నీ ఉండనున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. హృతిక్ రోషన్ తోపాటు జూనియర్ ఎన్టీఆర్ ఇద్దరూ స్టార్ నటులే. కాబట్టి మళ్లీ స్టారర్ ప్యాక్ రిపీట్ అయినట్లు ఉంది. ఇంతకుముందు స్పై యూనివర్స్ లో వచ్చిన పఠాన్, టైగర్ 3, వార్ లో కూడా సేమ్ సీన్స్ ఉన్నాయి. త్వరలోనే యూనివర్స్ నుంచి ఆల్ఫా మూవీ రానుంది. అందులో కూడా తమ స్టారర్ ప్యాక్ ను మేకర్స్ రిపీట్ చేస్తారేమో చూడాలి. మరి ఇప్పటికే వచ్చిన మూవీస్ హిట్ అవ్వగా.. ఇప్పుడు వార్-2ను ఆడియన్స్ ఎలా ఆదరిస్తారన్నది హాట్ టాపిక్. మరేం జరుగుతుందో తెలియాలంటే వెయిట్ చేయాల్సిందే.

## లాడెన్ డాక్యు సిరీస్ ఇన్‌స్టంట్ హిట్ కారణం?




ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలన్నది భారతీయుల నినాదం. దీనిని ప్రతిబింబిస్తూ, ఇటీవల ఆపరేషన్ సిందూర్ ని చేపట్టి దాదాపు 100 మంది కఠోరమైన పాకిస్తానీ ఉగ్రవాదుల్ని మట్టుపెట్టింది భారతీయ సైన్యం. ఉగ్రవాదులకు ఉగ్రవాద దేశాలకు తాము వ్యతిరేకం అని చెప్పుకునే అగ్రరాజ్యం అమెరికా కూడా ఆపరేషన్ సిందూర్ దెబ్బకు గడగడలాడింది. అమెరికా ఇంతకుముందు ఒసామా బిన్ లాడెన్ లాంటి కరుడుగట్టిన ఉగ్రవాదిని వెంటాడి వేటాడి చంపిన సంగతి తెలిసిందే. తమ దేశ విమానాశ్రయాల్లో ముస్లిములను ప్రత్యేకంగా స్క్రుటినీ చేసే అమెరికా, ఇప్పుడు ముష్కర ఉగ్ర దేశం పాకిస్తాన్ కి అండగా నిలుస్తూ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోంది. దీనిపై భారత్ లోలోన మరుగుతోంది. సరిగ్గా ఇలాంటి సమయంలో, ఇండియా- పాక్ వార్ జరుగుతున్న సమయంలో ఒసామా బిన్ లాడెన్ వేట ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటరీ సిరీస్ %-%అమెరికన్ మ్యాన్‌హంట్: ఒసామా బిన్ లాడెన్%-% నెట్ ఫ్లిక్స్ లో విడుదలైంది. ఈ సిరీస్ ఇండియాలో ఇన్ స్టంట్ హిట్ అయింది. ఓవైపు వార్ జరుగుతుండగా, లాడెన్ సిరీస్ ని చూసేందుకు భారతీయులు అమితాసక్తిని కనబరిచారు. అయితే ఈ వెబ్ సిరీస్ చూస్తున్నంత సేపు అమెరికాను ముప్పు తిప్పలు పెట్టిన ఉగ్రవాది లాడెన్ భారతీయులకు హీరోగానే కనిపించాడు. ఉగ్రమూకల్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కి మద్దతునిస్తున్న అమెరికా కచ్చితంగా విలన్ లాగే కనిపిస్తోంది. అమెరికాలోని భారతీయుల్ని పదే పదే హింసిస్తున్న అధ్యక్షుడు ట్రంప్ కూడా మరో ఉగ్రవాదిలాగే కనిపిస్తున్నాడు. అందువల్ల కూడా లాడెన్ హీరో అయ్యాడు. అతడు 9/11 దాడులతో అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ ని కుప్పకూల్చడం ద్వారా ప్రతీకారం తీర్చుకున్నాడు. అయితే ఇలాంటి ఉగ్రదాడులను ఎప్పుడూ వ్యతిరేకించే భారత్ సైతం ఇప్పుడు అమెరికా చర్యలను హర్షించలేని పరిస్థితి. ఇటీవలి కాలంలో పాకిస్తాన్ అధ్యక్షుడు అష్రఫ్ కంటే కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రమాదకరంగా కనిపిస్తున్నాడని విశ్లేషిస్తున్నారు. ట్రంప్ వల్ల భారతదేశానికి కలిగే నష్టం ఉగ్రదాడిని మించినది అని కూడా విశ్లేషిస్తున్నారు. ఈ సమయంలో అమెరికా దూకుడుకు ముకుతాడు వేసేందుకు తిరిగి ఇండియా సరైన ప్రణాళికతో ముందుకు రావాల్సి ఉంటుంది. ఇండియా- పాక్ యుద్ధం సమయంలో లాడెన్ డాక్యు సిరీస్ ని రిలీజ్ చేయడంలో నెట్ ఫ్లిక్స్ టైమింగుని కొనియాడకుండా ఉండలేం. ఈ సిరీస్ పుణ్యమా అని భారతదేశంతో అమెరికా స్నేహం ఎలాంటిదో కూడా బయటపడింది. ఇప్పుడు భారత్ విశ్లేషించుకునే పనిలో పడింది.

## పోస్టర్‌తోనే సునామీ సృష్టించిన ఎన్టీఆర్




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ఆయన నటిస్తున్న సినిమాలకు సంబంధించిన అప్డేట్స్ ఏమేం వస్తాయా అని ఎదురుచూస్తున్న తారక్ ఫ్యాన్స్ కు ముందుగా ఎన్టీఆర్‌నీల్ సినిమా నుంచి ఓ పోస్టర్ వచ్చింది. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి చిత్ర యూనిట్ ఓ పవర్‌ఫుల్ స్టిల్ ను రిలీజ్ చేస్తూ ఎన్టీఆర్ కు బర్త్ డే విషెస్ ను తెలియచేసింది. ఈ సినిమాలో ఎన్టీఆర్ చాలా పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేయబోతున్నాడని ముందు నుంచి చెప్తూనే వస్తున్నారు. ఎన్టీఆర్ నీల్ సినిమాలో ఫ్యాన్స్ కు గూస్‌బంప్స్ ఇచ్చే ఎలిమెంట్స్ చాలానే ఉండనున్నాయని కూడా మేకర్స్ ఇప్పటికే చెప్పారు. ఇక పోస్టర్ విషయానికొస్తే ఇందులో ఎన్టీఆర్ బ్లాక్ అండ్ బ్లాక్ ట్రాక్ సూట్ లో చాలా సన్నగా మునుపెన్నడూ లేనంత స్టైలిష్ గా కనిపిస్తున్నాడు. ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్రను నీల్ నెక్స్ట్ లెవెల్ లో డిజైన్ చేశాడని, ఎన్టీఆర్ ను నీల్ సరికొత్తగా ప్రెజెంట్ చేయబోతున్నాడని రిలీజ్ చేసిన పోస్టర్ మరియు చిత్ర యూనిట్ చెప్తున్న దాన్ని బట్టి అర్థమవుతుంది. వాస్తవానికి మేకర్స్ ఈ సినిమా నుంచి ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ముందుగా గ్లింప్స్ ను రిలీజ్ చేద్దామనుకున్నారు కానీ తర్వాత ఎన్టీఆర్ బాలీవుడ్ లో హృతిక్ రోషన్ తో కలిసి నటించిన వార్2 సినిమా నుంచి గ్లింప్స్ రిలీజవుతున్న సందర్భంగా దీన్ని వాయిదా వేశారు. వార్2 నుంచి గ్లింప్స్ లేకపోతే ఎన్టీఆర్ నీల్ సినిమా నుంచి గ్లింప్స్ ను రిలీజ్ చేయాలని ఎప్పుడో నీల్ ప్లాన్ చేసుకుని ఓ వీడియోను కూడా కట్ చేయించారని టాక్ వినిపించింది. రీసెంట్ గానే కర్ణాటకలోని మంగుళూరు దగ్గర ఓ కీలక షెడ్యూల్ ను పూర్తి చేసుకున్న ఎన్టీఆర్‌నీల్ సినిమా వచ్చే ఏడాది జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తో పాటూ ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన తర్వాతి షెడ్యూల్ మొదలుకానుంది.

## సింపుల్ ఫ్రాక్‌లో గుండెలు మరిగిస్తోంది




ఒకే ఒక్క పేరు.. ఇప్పుడు అన్ని ఇండస్ట్రీలను మరిగిస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ అన్ని చోట్లా ఈ నామధేయమే పదే పదే వినిపిస్తోంది. అంతగా తన ప్రతిభ, డ్యాన్సులతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ బ్యూటీ పేరు శ్రీలీల. ఒక తెలుగమ్మాయి ఈ స్థాయిలో దూసుకెళ్లడం అన్నది మునుపెన్నడూ లేదు. కెరీర్ ప్రారంభించిన చాలా తక్కువ సమయంలో స్టార్ డమ్ అందుకున్న ఏకైక తెలుగు బ్యూటీగా గొప్ప గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ సరసన రొమాంటిక్ కామెడీ చిత్రంలో నటిస్తోంది. ఆషిఖి ఫ్రాంఛైజీ సినిమా కాదు కానీ, ఇంచుమించు అదే షేడ్స్ తో కొత్త కథలో నటిస్తోందని కథనాలొచ్చాయి. శ్రీలీలకు ఇది బాలీవుడ్ లో గేమ్ ఛేంజర్ గా మారుతుందని కూడా అంచనా వేస్తున్నారు. మొదటి సినిమా సెట్స్ లో ఉండగానే, బాలీవుడ్ లో మరో సినిమాకి సంతకం చేసిందని కథనాలొచ్చాయి. మాస్ జాతర, పరాశక్తి, లెనిన్ అనే మూడు చిత్రాల్లోను నటిస్తోంది. మరోవైపు సోషల్ మీడియా ఫోటోషూట్లు, మ్యాగజైన్ కవర్ షూట్లతోను శ్రీలీల దూసుకెళుతోంది. తాజాగా %-%ఓపెన్ మ్యాగజైన్%-% శ్రీలీల ముఖ చిత్రంతో ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ ఫోటోషూట్ లో శ్రీలీల స్ట్రైకింగ్ ఫోజులతో కట్టి పడేసింది. సింపుల్ ఫ్రాక్ లో ఈ బ్యూటీ కట్టి పడేసింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ నుంచి యూనిక్ ఫోటోగ్రాఫ్ వైరల్ గా మారుతోంది.

## బికినీలో కంటే చీరలోనే అందంగా ఉన్నావ్..





సోషల మీడియా ప్రపంచంలోకి అడుగుపెట్టిన ప్రతి సెలెబ్రిటీ తన ఫొటోలతో నెట్టింట్లో ట్రెండ్ అవుతుంటారు. అలాంటి వారిలో టాప్ లిస్ట్‌లో నిలిచే పేరు పూజా హెగ్డే. ఎప్పుడూ గ్లామర్ గౌన్లు, ట్రెండీ డ్రెస్సులతో అభిమానులని మెస్మరైజ్ చేసే పూజా.. ఇప్పుడు చీరకట్టులో ఎంతో డిఫరెంట్‌గా కనిపించి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.తాజాగా పూజా హెగ్డే షేర్ చేసిన ఫొటోషూట్ లో ఆమె నీలం రంగు చీరను ధరించి పక్కకు కూర్చొని పుస్తకం చదువుతూ కనిపించింది. ఈ వింటేజ్ క్లాసిక్ స్టైల్‌లో పూజా మోడ్రన్ లుక్‌కు పూర్తిగా భిన్నంగా కనిపించింది. చీరలో ఆమె గ్లో, ఆమె చూపులో ఆ డెప్త్.. అన్నీ కలిపి వింటేజ్ ఫిల్మ్ స్టిల్‌లా చూపిస్తున్నాయి. ఆమె హెయిర్ స్టైల్, జ్వెలరీ కూడా సంప్రదాయాన్ని చూపిస్తూ, అద్భుతంగా కలిపాయి. పూజా హెగ్డే కెరీర్ గురించి చెప్పాలంటే.. మోడలింగ్‌తో కెరీర్ మొదలుపెట్టి తమిళ సినిమా ద్వారా సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తెలుగు సినిమాల్లో 'ఒక లైలా కోసం', 'ముకుంద' వంటి సినిమాల్లో కనిపించి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. 'దువ్వాడ జగన్నాథం', 'అల వైకుంఠపురములో', 'అరవింద సమేత' వంటి సూపర్ హిట్ సినిమాలతో తనను హీరోయిన్ గా నిలబెట్టుకుంది. తెలుగుతో పాటు హిందీ సినిమాల్లో కూడా పూజా కెరీర్ నిర్మాణం జరుపుతోంది. బాలీవుడ్‌లో 'హౌస్‌ఫుల్ 4', 'సర్కస్' లాంటి సినిమాల్లో నటించింది. అయితే కొంతకాలంగా ఆమెకు సరైన బ్రేక్ లేకపోవడంతో, కథలు ఎంపికలో కాస్త జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం పూజా కొన్ని తమిళ, హిందీ ప్రాజెక్టులతో పాటు ఓ భారీ వెబ్‌సిరీస్‌కూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో గ్లామర్ షూట్లు కాకుండా ఇలాంటి క్లాసిక్ లుక్స్ షేర్ చేస్తూ పూజా ట్రెండ్ మార్చాలని చూస్తోంది. ఆమె చీరలుక్‌కి నెటిజన్ల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఒకప్పుడు బికినీ లో కూడా పూజా మెస్మరైజ్ చేసిన విషయం తెలిసిందే. ఇక"బికినిలో కంటే చీరలోనే అందంగా ఉన్నావ్" అంటూ

## తమ్ముడుకి దిల్ రాజు మెరుగులు..!



దిల్ రాజు బ్యానర్ నుంచి ఒక సినిమా వస్తుంది అంటే ఆ సినిమాకు అన్నీ తానై చూసుకుంటాడు దిల్ రాజు. కథ విని ఓకే చేసినప్పటి నుంచి షూటింగ్ లో ప్రతిదీ ప్రత్యేకంగా చూస్తాడు. అంతేకాదు సినిమా అవుట్ పుట్ ని కూడా అంచనా వేస్తాడు. ఎడిటింగ్ రూం లో ఫైనల్ మిక్సింగ్ లో రిలీజ్ ముందు ప్రమోషన్స్ ఇలా దిల్ రాజు అంటే నిర్మాతగా కాదు సినిమాకు అన్ని క్రాఫ్ట్ లో పనిచేసే ఒక టెక్నీషియన్ గా ఉంటాడు. ఎందుకంటే డబ్బులు పెట్టేది తనే కాబట్టి ఆయన అంత జాగ్రత్త పడటంలో తప్పులేదు. ప్రస్తుతం దిల్ రాజు బ్యానర్ లో కొన్ని ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ సినిమాలు వస్తున్నాయి. అందులో నితిన్ హీరోగా వస్తున్న తమ్ముడు కూడా ఉంది. దిల్ రాజు బ్యానర్ లో ఆస్థాన దర్శకుడు అయిన వేణు శ్రీరామ్ డైరెక్షన్ లో తమ్ముడు సినిమా వస్తుంది. ఈ సినిమా విషయంలో దిల్ రాజు చాలా నమ్మకంగా ఉన్నాడు. సినిమాలో నితిన్ తో పాటు ఒకప్పటి హీరోయిన్ లయ కూడా ఇంపార్టెంట్ రోల్ లో నటిస్తుంది. సినిమాలో మేజర్ హైలెట్స్ లో ఆమె రోల్ కూడా ఒకటని అంటున్నారు. తమ్ముడు సినిమా నుంచి రీసెంట్ గా ఒక స్పెషల్ టీజర్ రిలీజైంది. అందులో పాత్రలను పరిచయం చేసి సినిమా ఎలా ఉండబోతుందో అని రుచి చూపించారు. ఐతే దిల్ రాజు ఈ సినిమా మీద స్పెషల్ ఫోకస్ చేస్తున్నారని తెలుస్తుంది. సినిమా దాదాపు పూర్తి కాగా దిల్ రాజు తుది మెరుగులు దిద్దుతున్నారని తెలుస్తుంది. నితిన్ ఈమధ్య సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొడుతున్నాయి కాబట్టి తమ్ముడు సినిమాతో అతనికి హిట్ ఇవ్వాలని చూస్తున్నాడు దిల్ రాజు. అందులో భాగంగానే సినిమాని ప్రత్యేక శ్రద్ధతో తెరకెక్కిస్తున్నారట. నితిన్ కూడా తమ్ముడు సినిమా మీద చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడని తెలుస్తుంది. ఇదే కాదు నితిన్ నెక్స్ట్ వేణు డైరెక్షన్ లో చేస్తున్న ఎల్లమ్మ సినిమా కూడా దిల్ రాజు నిర్మాణంలోనే వస్తుంది. సో తమ్ముడు హిట్ ఆ సినిమా మీద కూడా ఇంపాక్ట్ కలిగిస్తుంది కాబట్టి ముందు రిలీజ్ కాబోతున్న తమ్ముడు సినిమా మీద దిల్ రాజు స్పెషల్ కేర్ తీసుకుంటున్నట్టు తెలుస్తుంది. మరి ఫైనల్ గా ఈ తమ్ముడు ఏం చేస్తాడో చూడాలి.